

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 178 పేజీలు - 08 వెల - 05/- శుక్రవారం 26-06-2026


### పచ్చిరొట్టతో భూమికి రక్ష



## భారత్‌కు లాభం ఉంటేనే అమెరికాతో ట్రేడ్ డీల్

● అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు ● భారత్‌కు ప్రత్యేక ప్రయోజనం ఉంటేనే ఒప్పందం ● భారత ఉత్పత్తులకు అమెరికా మార్కెట్లో ప్రాధాన్యం కోరుతున్న భారత్ ● 50% సుంకాలను 18%కు తగ్గించే అంశంపై చర్చలు ● ఇతర దేశాల కంటే భారత్‌కు మెరుగైన అవకాశాలు కావాలని డిమాండ్



2

## లంచం కేసులో చిక్కిన తహసీల్దార్.. రూ. 5 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు!

● లంచం కేసులో పట్టుబడ్డ షామీర్‌పేట తహసీల్దార్ సుచరితపై మరో కేసు ● ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు తేలడంతో కేసు నమోదు చేసిన ఏసీబీ ● సోదాల్లో రూ. 5.05 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించిన అధికారులు ● నెల క్రితం రూ. 2 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సుచరిత

మిగతాది 2లో



# రాష్ట్రాల సమన్వయంతో నీటి సమస్యలకు చెక్

● తుంగభద్ర సమస్యలపై హైలెవల్ కమిటీ ● కేంద్రం ఆప్షన్లు ఇస్తుంది.. మంచివి ఎంచుకోండి ● జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సూచన ● దేశంలో డ్యాంల పూడికతీతకు భారీ ప్రణాళిక ● దీంతో తుంగభద్ర సామర్థ్యం 30 శాతం పెరుగుతుంది ● పరస్పర సహకారంతోనే తుంగభద్రకు 33 కొత్త గేట్లు ● నదుల లింకింగ్‌తో భారత్ ఏకతాటిపైకి: పాటిల్ ● ఐకమత్యంతోనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యం





ఇచ్చిపుచ్చుకుంటేనే ప్రయోజనం: చంద్రబాబు

తుంగభద్ర గేట్ల ఆధునికీకరణతో 3 తరాల నీటి సమస్యకు పరిష్కారం: రేవంత్

రైతుల కోసం సమన్వయంతో పనిచేస్తాం: డీకే

బళ్లారి/అమరావతి, జూన్ 25 తుంగభద్ర నదీ జల వివాద పరిష్కారం కోసం కేంద్రం నేతృత్వంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సీనియర్ అధికారులతో 'హైలెవల్ కమిటీ (ఉన్నత స్థాయి కమిటీ)' వేస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఈ కమిటీ 100 రోజుల్లోగా జల వివాదాల పరిష్కార చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు.మిగతాది 2లో

# ఉద్యోగులకు భారీ భరోసా..

## ఉచిత బీమా, పీఆర్సీపైనా సీఎం హామీ

ప్రమాద బీమా కవరేజీ రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లు

- రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత ప్రమాద బీమా
- 14 బ్యాంకులతో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూలు
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపు
- విమాన ప్రమాద బీమా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు
- పీఆర్సీ హామీని తప్పకుండా అమలు చేస్తామని సీఎం స్పష్టం



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు 14 బ్యాంకులతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా ఒప్పందాలపై మిగతాది 2లో

### ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై నారా లోకేష్ దృష్టి..

## అధికారులకు కీలక ఆదేశాలు

సెప్టెంబర్ 5 నుంచి ఏఐ ట్యూటర్ విధానం పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభం



● ప్రభుత్వ పాఠశాలలకు లక్షకు పైగా కొత్త అడ్మిషన్లు ● ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై అధ్యయనానికి ఆదేశం ● అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, అభ్యసన ఫలితాలపై ఈ విద్యా సంవత్సరం ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్యశాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖకు సంబంధించిన పలు కీలక వివరాలను అధికారులు మంత్రికి వివరించారు.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సుమారు 1,06,000 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 7,620 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,515 పాఠశాలలు (46.13 శాతం) ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో మిగతాది 2లో

## కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం

● డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని జగన్ ఆరోపణ ● దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన ● రుణాలపై వడ్డీ రాయితీ హామీని విస్మరించడం వల్ల మహిళలకు రూ.6 వేల కోట్లు నష్టం ● వైసీపీ హయాంలో వడ్డీ రాయితీ కింద రూ.4,969 కోట్లు చెల్లించామని వెల్లడి



2

# రియల్ ఎస్టేట్‌ను

## బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే: కేటీఆర్



2

● రూ.కోటి విలువ భూములు ఇప్పుడు రూ.60 లక్షలకు కూడా అమ్ముడవడం లేదని వ్యాఖ్య ● కేసీఆర్ హయాంలో పరిశ్రమలతో భూముల విలువలు పెరిగాయని వెల్లడి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ఎన్నికలకు ముందు రూ.కోటి పలికిన ఎకరం భూమి ప్రస్తుతం రూ.50-60 లక్షలకు కూడా కొనుగోలుదారులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు.

## 2028 నాటికి ఫస్ట్ ఫేజ్ పూర్తి: అమరావతి బసవతారకం ఆసుపత్రి సైట్‌లో బాలకృష్ణ

2

- ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన బాలయ్య
- నిర్మాణ పనులు చాలా వేగంగా సాగుతున్నాయని వెల్లడి
- లాభాపేక్ష లేకుండా క్యాన్సర్ బాధితులకు సేవ చేయడమే లక్ష్యమన్న బాలయ్య



అమరావతిలో బసవతారకం ఇండో-అమెరికన్ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆసుపత్రి పనులను హిందూపూర్ ఎమ్మెల్యే, ఆసుపత్రి చైర్మన్ బాలకృష్ణ ఈరోజు క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించారు. సైట్ ఇంజనీర్లతో కలిసి ల్యాండ్

## మీ కుటుంబానికే ఇలా జరిగితే?..

### బాధితుల పట్ల అమర్యాదగా నడుచుకుంటే ఊరుకోం: సజ్జనార్



● పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల సిబ్బంది తీరుపై సీపీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం ● క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహణ ● ఫిర్యాదుదారులతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు రహస్య తనిఖీల్లో వెల్లడి

మిగతాది 2లో

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై నారా లోకేష్ దృష్టి..

# అధికారులకు కీలక ఆదేశాలు

ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సుమారు 1,06,000 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 7,620 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,515 పాఠశాలలు (46.13 శాతం) ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని వారు వివరించారు. విద్యా రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్లే ఈ సానుకూల మార్పు చోటుచేసుకుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ అంశంపై కూడా ప్రధానంగా చర్చించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. మరోవైపు, సెప్టెంబర్ 5 నుంచి మొదటి విడత కింద 175 'లీప్' పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థుల కోసం 'ఏఐ ట్యూటర్' విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని 'క్లిక్కర్స్'కు అనుసంధానించాలని మంత్రి అధికారులకు సూచించారు. అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, విశాఖపట్నంలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. వచ్చే నెలలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు భారీ భరోసా.. ఉచిత బీమా, పీఆర్సీపైనా సీఎం హామీ



ఒప్పందాలపై సంతకాలు చేసి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ప్రభుత్వం కోసం కష్టపడే ఉద్యోగుల భద్రతను కాపాడటం తమ బాధ్యత అని చెప్పారు. ఉద్యోగులు అడగక ముందే ప్రభుత్వం ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా బీమా ప్రయోజనాలు కొనసాగించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా కింద ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు కవరేజీ లభిస్తుందని తెలిపారు. విమాన ప్రమాదాల సందర్భంలో బ్యాంకులు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా రక్షణ అందిస్తాయని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ స్పష్టం చేశారు. పీఆర్సీ విషయంలో ఇచ్చిన హామీని కూడా తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల నమ్మకమే ప్రభుత్వానికి బలమని, ప్రభుత్వాలు మారినా ఉద్యోగ వ్యవస్థ శాశ్వతమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉండేదని విమర్శించిన సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా తొలి రోజే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెరిగేలా ఉద్యోగులు ప్రతిరోజూ అదనంగా గంట పనిచేయాలని కోరారు. వచ్చే అదనపు ఆదాయాన్ని ఉద్యోగుల సంక్షేమానికే వినియోగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాజకీయ అంశాలపైనా స్పందించిన సీఎం తాను "గుంపు మేస్త్రీ"నని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే తన బృందానికి నాయకత్వం వహిస్తున్నానని అన్నారు. మూసీ నది ప్రక్షాళన, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

# మీ కుటుంబానికే ఇలా జరిగితే?..

## బాధితుల పట్ల అమర్యాదగా నడుచుకుంటే ఊరుకోం: సజ్జనార్

హైదరాబాద్ పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై నగర పోలీస్



కమిషనర్ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజలతో అమర్యాదగా, బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి నేర సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "కష్టాల్లో ఉండి, మానసిక వేదనతో ఆసరా కోసం పోలీస్ స్టేషన్ గడప తొక్కే ప్రజలతో వ్యవహరించాల్సిన పద్ధతి ఇదేనా?" అంటూ అధికారులను సజ్జనార్ నిలదీశారు. కొన్ని స్టేషన్లలో రిసెప్షనిస్టులు, పరిపాలనా బాధ్యతలు చూసే అడ్మిన్ ఎస్సైల ప్రవర్తన సరిగా లేదని, సమయపాలన కూడా పాటించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్యవేక్షణ లోపించినందుకు కొందరు ఇన్‌స్పెక్టర్లకు ఇప్పటికే ఛార్జిమెమోలు జారీ చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సీపీ సజ్జనార్ ఒక వినూత్న వ్యూహాన్ని అమలు చేశారు. ఆయన స్వయంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. కొందరు పోలీసు అధికారులనే సాధారణ పౌరులుగా, సివిల్ డ్రెస్‌లో ఫిర్యాదులు చేసేందుకు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు పంపించారు. అక్కడ సిబ్బంది స్పందించిన తీరు, వారికి ఎదురైన అనుభవాలపై నివేదిక తెప్పించుకున్నారు. ఈ రహస్య ఆపరేషన్‌లో దాదాపు 12 పోలీస్ స్టేషన్లలో సిబ్బంది తీరు దారుణంగా ఉన్నట్లు వెల్లడైంది. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారితో రిసెప్షనిస్టులు, ఏఎస్సైలు కఠినంగా మాట్లాడటం, అది తమ పరిధిలోకి రాదంటూ పక్క స్టేషన్లకు నెట్టేయడం, సూటిపోటి మాటలతో వేధించడం వంటివి ఈ తనిఖీల్లో బయటపడ్డాయి. అంతేకాకుండా, ఫిర్యాదును వెంటనే స్వీకరించకుండా 'రేపు రా.. మాపు రా..' అంటూ బాధితులను రోజుల తరబడి తిప్పించుకున్నట్లు స్పష్టమైంది. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సజ్జనార్ భావోద్వేగంగా మాట్లాడారు. "మీ కుటుంబ సభ్యులే ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు, అక్కడ ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులే ఎదురైతే మీరెలా భావిస్తారో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోండి" అని హితవు పలికారు. ఇకపై ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తే సస్పెన్షన్లు, బదిలీలు తప్పవని ఆయన గట్టిగా హెచ్చరించారు.

# రాష్ట్రాల సమన్వయంతో నీటి సమస్యలకు చెక్

దాదాపు 70 ఏళ్లుగా తుంగభద్ర నీటి కోసం వివాదాలు నెలకొన్న నేపథ్యంలో వాటిని పరిష్కరించడానికి జలశక్తి మంత్రి చొరవ చూపారు. తుంగభద్ర డ్యాంకు ఏర్పాటు చేసిన కొత్త క్రస్ట్ గేట్లను పాటిల్ గురువారం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, డీకే శివకుమార్, ఎ.రేవంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. తొలుత 17, 18, 19, 20వ నంబరు గేట్ల వద్ద పూజలు నిర్వహించి.. జాతికి అంకితం చేశారు. అనంతరం డ్యాం దిగువన కొప్పళ జిల్లా మునిరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఏపీ, కర్ణాటక నుంచి పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు. తుంగభద్ర సంబంధిత వివాదాల పరిష్కారం కోసం కేంద్రం సీనియర్ అధికారులతో త్వరలోనే ఉన్నత స్థాయి కమిటీ వేస్తుందని పాటిల్ తెలిపారు. ఈ కమిటీ కొన్ని ఆప్షన్లు ఇస్తుందని.. వాటిలో ప్రయోజనం చేకూర్చేవాటిని ఆయా రాష్ట్రాలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ ప్రతిపాదనను ముగ్గురు సీఎంలు స్వాగతించారు. దేశవ్యాప్తంగా అనేక ఆనకట్టల్లో 15 శాతానికి పైగా పూడిక పేరుకుపోయిందని, దీంతో నీటినిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయిందని పాటిల్ చెప్పారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూడిక తొలగింపు కోసం కేంద్రం సొంత నిధులతో త్వరలో భారీ ప్రణాళిక అమలు చేయనుందని తెలిపారు. దీని అమలు బాధ్యతను రాష్ట్రాలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. తుంగభద్ర జలాశయంలో కూడా 15శాతానికి పైగా పూడిక పేరుకుపోయిందని.. విజయవంతంగా పూడిక తీస్తే నీటి నిల్వ సామర్థ్యం 25 నుంచి 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక మధ్య జలవివాదాలు ఉన్నప్పటికీ.. తుంగభద్ర డ్యాం గేట్ల ప్రారంభోత్సవానికి ముగ్గురు సీఎంలూ ఒకే వేదికపైకి వచ్చారని, సహకార భావంతో ముందుకు సాగడం చరిత్రాత్మక పరిణామమని పాటిల్ తెలిపారు. పరస్పర సహకారం, ఆర్థిక మద్దతుతోనే తుంగభద్ర జలాశయానికి అత్యవసరంగా 33 నూతన గేట్లను అమర్చడం సాధ్యమైందని గుర్తుచేశారు. నదీ జలాల విషయంలో ఉత్తరాది రాష్ట్రాలు సమన్వయంతో.. సామరస్యపూర్వకంగా వివాదాలకు తావులేకుండా పరిష్కరించుకుంటున్నాయని పాటిల్ వివరించారు. నదుల అనుసంధానం కోసం కేంద్రం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ నదీ జలాలను పారిస్తున్నాయని చెప్పారు. కొన్ని రాష్ట్రాలు నేరుగా పైపుల ద్వారా పొలాల్లోకే నేరుగా సాగునీటిని తీసుకువెళ్తూ రెండు పంటలు పడిస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు కూడా కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకుంటూ నదుల అనుసంధాన పథకాన్ని చేపట్టేందుకు ముందుకు రావాలని పాటిల్ సూచించారు. తమకొక రాష్ట్రం ఎక్కువ కాదు.. మరో రాష్ట్రం తక్కువా కాదని స్పష్టం చేశారు. రాష్ట్రాలు బాగుపడితేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని కేంద్రం బలంగా నమ్ముతోందన్నారు.

### రైతుల భవిత కోసం మూడు రాష్ట్రాల ఐక్యత

తుంగభద్ర పరివాహక ప్రాంత రైతుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఐక్యంగా ఉండాలని చరిత్రాత్మక నిర్ణయానికి వచ్చాయని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సభలో అన్నారు. 'జలవనరుల శాఖ చరిత్రలో ఈ రోజు ఒక మైలురాయి. మన నీరు-మన హక్కు అనే భావనతో మూడు రాష్ట్రాల రైతుల సంక్షేమాన్ని కాపాడే దిశగా ఈ సమావేశం జరిగింది. తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల్లోనే స్టాప్‌లాక్‌ను అమర్చింది. భవిష్యత్‌లో డ్యాం భద్రతను దృష్టిలో ఉంచుకుని మొత్తం 33 స్పిల్‌వే గేట్లను మార్చే సాహసోపేత నిర్ణయం తీసుకున్నాం. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక నాయకత్వం కలిసి రైతుల ప్రయోజనాల కోసం ఒకే వేదికపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం దేశ చరిత్రలో అరుదైన ఘట్టం. రైతులకు జీతం లేదు, పదోన్నతి లేదు, పెన్షన్ లేదు అయినా దేశానికి అన్నం పెడుతున్నారు. అలాంటి రైతుల సంక్షేమం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత' అని చెప్పారు.

### బాబు పట్టుదలతో ఓ నగరమే అభివృద్ధి

'బెంగళూరు సహజసిద్ధంగా అభివృద్ధి చెందిన నగరం. ఇక్కడి వాతావరణం, లాజిస్టిక్స్ నగరాభివృద్ధికి దోహదపడ్డాయి. కానీ హైదరాబాద్ పరిస్థితి అలా కాదు. ఆ నగరాన్ని చంద్రబాబు పట్టుదల, అనుభవం, దూరదృష్టితో ఐటీతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు' అని సీఎం డీకే శివకుమార్ ప్రశంసించారు. కొత్త గేట్ల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు కర్ణాటక వెళ్లిన చంద్రబాబు హోస్పేట్‌లోని ఐఆర్బీ అతిథిగృహంలో శివకుమార్, రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శివకుమార్ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాను, చంద్రబాబు ఇద్దరం యువజన కాంగ్రెస్ నుంచి వచ్చిన వారిమేనని.. ఆయన పోరాటస్ఫూర్తి, పట్టుదల, దూరదృష్టి గురించి పలు సందర్భాల్లో తాను మాట్లాడుతుంటానని చెప్పారు. కేంద్ర మంత్రి పాటిల్ సైతం.. దేశంలో అభివృద్ధిపై దృష్టి సారించిన నాయకుల్లో చంద్రబాబు ముందువరుసలో ఉంటారని చెప్పారు. చంద్రబాబు శ్రద్ధే కారణం

### లేదంటే నాలుగైదేళ్లు పట్టేది: కన్నయ్యనాయుడు

*తుంగభద్ర డ్యాంకు యుద్ధప్రాతిపదికన కొత్త క్రస్ట్‌గేట్లను అమర్చడంపై ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపారని, లేకుంటే ఈ క్రస్ట్ గేట్ల అమరిక మరో నాలుగైదేళ్లు ఆలస్యమయ్యేదని ఇంజనీరింగ్/గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు అన్నారు. తుంగభద్ర డ్యాంపై ఆయన మాట్లాడారు. మరో 50 ఏళ్ల వరకూ డ్యాంకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తదని భరోసా ఇచ్చారు. దక్షిణాదిలో ఏ ప్రాజెక్టుకూ 60అడుగుల వెడల్పు గల గేట్లు లేవన్నారు.*

### 2028 నాటికి ఫస్ట్ ఫేజ్ పూర్తి: అమరావతి బసవతారకం

# ఆసుపత్రి సైట్‌లో బాలకృష్ణ

ఎమ్మెల్యే, ఆసుపత్రి చైర్మన్ బాలకృష్ణ ఈరోజు క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించారు. సైట్ ఇంజనీర్లతో కలిసి ల్యాండ్ మ్యాప్స్, కన్‌స్ట్రక్షన్ డిజైన్లను రివ్యూ చేసిన బాలయ్య.. ఆసుపత్రి టైమ్‌లైన్‌కు సంబంధించిన కీలక విషయాలను వెల్లడించారు. అమరావతిలో క్యాన్సర్ పేషెంట్లకు వరంగా మారబోతున్న ఈ మెగా ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రస్తుతం చాలా వేగంగా సాగుతున్నాయని బాలకృష్ణ తెలిపారు. వచ్చే నెల పుట్టింగ్ పనులు మొదలవుతాయని చెప్పారు. హాస్పిటల్ బిల్డింగ్ నిర్మాణాన్ని అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు వర్కర్లు పగలూ రాత్రి షిఫ్టుల్లో కష్టపడుతున్నారని తెలిపారు. అయితే, వర్షాకాలం కారణంగా పనులు కొంత నెమ్మదించే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిని మరింత విస్తరిస్తున్నామని... అదే క్రమంలో ఏపీ రాజధానిలోనూ అధునాతన వైద్యం అందించడమే తమ లక్ష్యమని బాలయ్య స్పష్టం చేశారు. అమరావతి ప్రాజెక్టుకు సంబంధించి 2028 నాటికి మొదటి దశ నిర్మాణ పనులు పూర్తై, రోగులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, కేవలం క్యాన్సర్ బాధితులకు ప్రపంచ స్థాయి సేవ చేయాలనే ఏకైక పవిత్ర ధ్యేయంతోనే ఈ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు ప్రకటించారు.

## కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏపీలోని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు గురువారం ట్విట్టర్ వేదికగా ఆయన స్పందించారు. డ్వాక్రా మహిళలకు రుణాలు అందిస్తే వారికి ఆర్థిక స్వావలంబన కలగడమే కాకుండా, ఉత్పాదక రంగాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంటుందని జగన్ పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో స్వయం సహాయక గ్రూపు రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని జగన్ విమర్శించారు. ఈ హామీని అమలు చేయకపోవడం వల్ల మహిళలు ఏటా రూ.3 వేల కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.6 వేల కోట్ల ప్రయోజనాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ హయాంలో డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ కింద రూ.4,969 కోట్లు చెల్లించామని, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా అండగా నిలిచామని జగన్ గుర్తుచేశారు. పెంచిన రుణ పరిమితి సంగతి అటుంచి, ప్రస్తుతం ఉన్న వడ్డీ రాయితీ పథకానికి కూడా మద్దతు ఇవ్వకుండా కూటమి సర్కార్ నిర్వీర్యం చేసిందని ఆయన మండిపడ్డారు.

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే

కేసీఆర్ హయాంలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ చెప్పారు. షాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్‌స్పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకొచ్చామని చెప్పారు. పరిశ్రమల విస్తరణతో ఒకప్పుడు రూ.30 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాల అంశాల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలు తమ పాలనలో చేసిన అప్పుల లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసమే ఖర్చయ్యాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## భారత్‌కు లాభం ఉంటేనే అమెరికాతో ట్రేడ్ డీల్: పీయూష్ గోయల్

అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాల కంటే భారతీయ ఉత్పత్తులకు ప్రత్యేక ప్రయోజనం లభించని పక్షంలో అగ్రరాజ్యంతో ఎలాంటి ఒప్పందంపై సంతకం చేయబోమని స్పష్టం చేశారు. లండన్ పర్యటనలో మాట్లాడిన ఆయన భారత ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్లో ప్రత్యేక అవకాశాలు కల్పించేలా చట్టపరమైన, విధానపరమైన వ్యవస్థను అమెరికా రూపొందించాల్సి ఉందన్నారు. ఆ అంశం ఖరారయ్యే వరకు ఒప్పందం కుదరదని తేల్చిచెప్పారు. భారత్-అమెరికా మధ్య జరుగుతున్న చర్చల్లో దిగుమతి సుంకాల తగ్గింపు కీలక అంశంగా మారింది. గతంలో భారత ఉత్పత్తులపై దాదాపు 50 శాతం వరకు ఉన్న సుంకాలను 18 శాతానికి తగ్గించే ప్రతిపాదన ఆధారంగా చర్చలు సాగాయని గోయల్ వెల్లడించారు. అలా జరిగితే భారత ఉత్పత్తులకు ఇతర దేశాల కంటే అమెరికా మార్కెట్లో ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో ఇటీవల ఢిల్లీలో జరిగిన చర్చల అనంతరం కూడా ఇరు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు కట్టుబడి ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ తెలిపింది. అయితే పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై ఇంకా తుది నిర్ణయం రాలేదు. ఈ ఏడాది ప్రారంభంలో మధ్యంతర వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు మొదలైనప్పటి నుంచి ఇది మూడో విడత చర్చలు కావడం విశేషం.

## లంచం కేసులో చిక్కిన తహసీల్దార్.. రూ. 5 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు!

లంచం కేసులో అరెస్టయి సస్పెన్షన్‌కు గురైన షామీర్‌పేట మాజీ తహసీల్దార్ టి. సుచరిత మెడకు మరో ఉచ్చు బిగుసుకుంది. ఆమెపై ఆదాయానికి మించిన ఆస్తుల (డీఏ) కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. లంచం తీసుకుంటూ పట్టుబడిన నెల రోజులకే ఈ కొత్త కేసు నమోదు కావడం గమనార్హం. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేట మండలంలో తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, జాయింట్ సబ్-రిజిస్ట్రార్‌గా పనిచేసిన సుచరిత, ఆమె డ్రైవర్ వి. నగేష్‌ను మే 26, 2026న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 30 ఎకరాల వ్యవసాయ భూమికి నాలా (చీూజ) మార్పిడి కోసం ఒక వ్యక్తి నుంచి ఎకరాకు లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ. 30 లక్షలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా రూ. 2 లక్షలు ముడుపులు తీసుకుంటుండగా అధికారులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అవినీతి ద్వారా అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై జూన్ 25న సుచరితపై ఏసీబీ అధికారులు అక్రమాస్తుల కేసు నమోదు చేశారు. ఆమె నివాసంతో పాటు ఇతర మూడు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో భారీగా ఆస్తులు బయటపడ్డాయి. అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిలో రూ. 12 లక్షల నగదు, రూ. 1.2 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలు ఉన్నాయి. వీటితో పాటు బ్యాంకు ఖాతాల్లో రూ. 38 లక్షలు, ఒక వోక్స్‌వ్యాగన్, ఒక హ్యుందాయ్ క్రెటా కార్లు, హైదరాబాద్‌లో మూడు ఫ్లాట్లు, కీసర, ఖానామెట్ గ్రామాల్లో రెండు ప్లాట్లు, సిద్దిపేట జిల్లా దమ్మరకుంట గ్రామంలో వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు 5.05 కోట్లు రూపాయలుగా ఉంటుంది. లంచం కేసు తర్వాత సస్పెన్షన్‌కు గురైన సుచరితపై తాజాగా నమోదైన అక్రమాస్తుల కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు.

# పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల నియోజకవర్గ పరిధిలోని జెకె ఫంక్షన్ హాల్, రాజా రెడ్డి ఫంక్షన్ హాల్, మునగాల గ్రామంలో జరిగిన పలు వివాహ కార్యక్రమాలలో నంద్యాల మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ దేవనగర్ బాషా, నంద్యాల జిల్లా వైసీపీ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు కారు రవికుమార్, మునగాల మాజీ సర్పంచ్ లోకేశ్వర్ రెడ్డి, పులిమద్ది మాజీ సర్పంచ్, రవికుమార్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు..

# సమిష్టి కృషితో పోలియో విజయవంతం చేద్దాం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 25 : సమిష్టి కృషితో అలసిపోలియో కార్యక్రమాన్ని




విజయవంతం చేద్దామని వైద్యాధికారి దినేష్ బాబు పేర్కొన్నారు. ఈనెల 28న జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో వైద్యాధికారి దినేష్ బాబు గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 20 బూత్ లు 40 బృందాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి బూత్ లో నలుగురు టీం సభ్యులు ఉంటారని తెలిపారు. ఈనెల 28న ఆదివారం పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, మంగళవారం ఇంటింటా సర్వే చేసి మార్కింగ్ వేస్తూ పోలియో చుక్కలు వేసుకో ని పిల్లలకు పోలియో చుక్కలను వేయడం జరుగుతుందని తెలిపారు. నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 3654 మంది పిల్లలు ఉన్నారని, బూత్ నందు వంద శాతం పిల్లలకు పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వైద్యాధికారి దినేష్ బాబుతోపాటు మహిళా వైద్యాధికారి హేమంత సమీరా, ఎం పి హెచ్ ఈ ఓ వెంకటరమణ, ఆరోగ్య పర్యవేక్షకులు విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలతో పాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# భాగ్యనగరంగ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం



దొర్నిపాడు జూన్ 25 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలోని భాగ్యనగరంగ్రామంలోగురువారం మండలవ్యవసాయఅధికారిని ప్రమీలఆధ్వర్యంలోరైతన్నమీకో సంకార్యక్రమంనిర్వహించారు, ఈ కార్యక్రమంలో కోయిలకుంట్ల సహాయ వ్యవసాయసంచాలకులు సుధాకర్ పాల్గొన్నారు, ఆయనమాట్లాడుతూప్రభుత్వం రైతులకుతొమ్మిదిరకాల సహకారాలనుఅందిస్తుందన్నారు అందులో వ్యవసాయ శాఖ తరుపున 1. సబ్సిడి పై బిందు, తుంపర సేద్యం పరికరాలు 2.పొలం పిలుస్తోందికార్యక్రమం. 3.ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు. 4. సబ్సిడీ పై వ్యవసాయ యంత్రాలు. 5.యూరియా మరియు ణాూ ఖజూఖఆఎం ఖజూజూ ఎఝఖతీఖ పంపిణీ. 6.మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు 7. ూజూఖఆఎం సమగ్ర డిజిటల్ వ్యవసాయ వేదిక. 8.ప్రపంచ ఉద్యాన హబ్ గా రాష్ట్రాన్ని మార్చుట. 9.ఉద్యాన రైతులకు అదనపు సాయం మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. మండల వ్యవసాయఅధికారి మాట్లాడుతూ ఇకపై యూరియా ణాూ ఖజూఖఆఎం ఖజూజూ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు, ఈ సంవత్సరంఎల్ నినోప్రభావం వలన వర్షాలు తక్కువగా ఉంటాయికనుక రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోలీసు అధికారులతో డీజీపీ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్..!

*-జిల్లా పోలీసు కార్యాలయం నుంచి హాజరైన ఎస్పీ నరసింహ ఐపీఎస్..!*

*-కేసుల నమోదు, దర్యాప్తు విధానాలపై జిల్లా ప్రణాళిక వివరించిన ఎస్పీ..!*

సూర్యాపేట జిల్లా ప్రతినిధి। 25-06-2026 డీజీపీ కార్యాలయం ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి పోలీసు అధికారుల సమావేశం నిర్వహించారు. ప్రజా న్యూస్ నెట్‌వర్క్ సమాచారం మేరకు ఈ సమావేశానికి సీఐడీ డీజీ చారు సిన్హా ఐపీఎస్ అధ్యక్షత వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పాల్గొన్నారు. సమావేశంలో కేసుల నమోదు, దర్యాప్తు విధానాలు, నేర నియంత్రణ చర్యలు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవల అందింపుపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ కేసుల నమోదు, విచారణలో అనుసరిస్తున్న ప్రణాళికలు, తీసుకుంటున్న చర్యలను ఎస్పీ నరసింహ వివరించారు. నేరాల నియంత్రణ, వేగవంతమైన దర్యాప్తు, బాధితులకు న్యాయం అందించే అంశాలపై ప్రత్యేకంగా చర్చించినట్లు సమాచారం.

# టెక్కే మార్కెట్ వద్ద కారు బీభత్సం

**ఫుట్‌పాత్‌పై అరటిపండ్లు అమ్ముతున్న వృద్ధురాలిని ఢీకొట్టిన కారు.**

**● రెండు కాళ్లు విరగడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు.. ● డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని స్థానికుల ఆరోపణ.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను కలచివేసింది. ఫుట్‌పాత్‌పై కూర్చొని అరటిపండ్లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్న ఓ వృద్ధురాలిపై ఓ కారు అదుపుతప్పి ఎక్కడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలికి రెండు కాళ్లు విరిగినట్లు సమాచారం. వెంటనే స్థానికులు స్పందించి ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ భారీగా ప్రజలు గుమిగూడారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల




స్థానికులు ఆరోపించారు. ఫుట్‌పాత్‌పై ఉన్న చిరు వ్యాపారుల భద్రతపై అధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు. ఈ ఘటనపై కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ప్రమాదానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నంద్యాల జిల్లా పోలీసు అడ్మినిస్ట్రేషన్ సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహణ.

**● పెండింగ్ వర్క్స్ లేకుండా నిబద్ధతతో విధులు నిర్వహించండి.. ● పోలీసు అదికారులకు సిబ్బందికి రావసిన బెన్ఫిట్స్ వివరాలపై ఆరా.. ● సకాలంలో పోలీసు వారి వృతి పరమైన ఫిర్యాదులు పరిస్కరించండి..**

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు నేడు నంద్యాల జిల్లా పోలీసు పరిపాలన విభాగ సిబ్బందితో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.యుగంధర్ బాబు సమీక్షాసమావేశం నిర్వహించడం జరిగింది. జిల్లా పరిపాలన కార్యాలయంలోని వివిద విభాగాలు అనగా అడ్మినిట్రేషన్ సెక్షన్ ,బడ్జెట్ సెక్షన్, పె సెక్షన్ ,జెనరల్ సెక్షన్,ఇన్ వర్డ్ ,ఔట్ వర్డ్ ,స్టోర్ మొదలగు అన్నీ విభాగాల సిబ్బందితో మాట్లాడి ఆఫీసుకు సంబందించిన రికార్డులు సరిగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకొని పై అన్నీ విభగాలపై పెండింగ్ వర్క్స్ పై సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ సిబ్బందికి అందవలసిన అన్నీ బెన్ఫిట్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అడ్మినిస్ట్రేషన్ అదికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బంది యొక్క మెడికల్ బిల్లులకు సంబంధించిన వివరాలు తెలుసుకొని పెండింగ్ బిల్లులను త్వరగా క్లియర్







చేసి సిబ్బందికి టైం కు అందించాలని ,ఆఫీసు నందు పెండింగ్ ఉండకుండా చూసుకోవాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది యొక్క ఏ పి జి ఎల్ ఐ , జి పి ఎఫ్ భద్రత పర్సనల్ లోన్ లకు సంబందించి అప్లై చేసుకున్నవారికి సకాలంలో లోన్ అందించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసు సీనియారిటీకి సంబంధించిన రికార్డులను మరియు వారి ప్రమోషన్ కు సంబంధించిన రికార్డులను ఎలాంటి అవకతవకకు తావులేకుండా జాగ్రతగా ప్రభుత్వ నిబందనల ప్రకారం ప్రమోషన్ వచ్చేలా రికార్డులు ఉంచుకోవాలని ఆదేశించారు.

సిబ్బందికి అందవలసిన ఇంక్రిమెంట్ ,మిస్సింగ్ క్రెడిట్స్ టి ఎ లు , శాలరీ పెండింగ్ మొదలగునవి పెండింగ్ లో లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ తో పాటు పరిపాలన విభాగ అదికారులు వీరన్నగ , ఖాదర్ వలి , కవిత , సురేష్ , అడిషనల్ ఎస్పీ క్యాంప్ క్లార్క్ రాఘవేంద్ర , వివిద విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

# జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమం

**☛ నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ ఎం.రఘు**

**☛ 5 ఏళ్లలోపు చిన్నారులందరూ పోలియో చుక్కలు వేయించుకోవాలి**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు నగరంలోని కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఎం.రఘు మాట్లాడుతూ.. పోలియో మహమ్మారి నుంచి పిల్లలను రక్షించేందుకు పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.కర్నూలు నగరంలోని 229 పోలియో బూత్‌ల పరిధిలో 82,964 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.జూన్ 28న చుక్కలు వేయించుకోలేని చిన్నారులకు జూన్ 29, 30 తేదీల్లో పల్స్ పోలియో బృందాలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రయాణాల్లో ఉన్న చిన్నారులను బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇటుక బట్టీలు, సంచార జాతుల నివాస ప్రాంతాలు, రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలు, క్వారీల వద్ద గుర్తించి వారికి కూడా పోలియో వ్యాక్సిన్ అందించాలని సూచించారు.

అలాగే చిన్నారులు ఇళ్లలో, పొలాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో ఎక్కడ ఉన్నా వారిని గుర్తించి పోలియో చుక్కలు వేయడం ద్వారా ఒక్క చిన్నారిని కూడా వదిలిపెట్టకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు వేసి వారి నిండు జీవితాన్ని కాపాడుదామని ఎంహెచ్ఓ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ భార్గవి, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సర్వేపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..!

సూర్యాపేట జిల్లా ప్రతినిధి। 25-06-2026। సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో గురువారం నుంచి ప్రారంభమైన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ఇంటింటి సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా న్యూస్ నెట్‌వర్క్ సమాచారం మేరకు జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (దీూలు) ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరుకు రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని, ఓటరు వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత దీూకు తెలియజేసి సరిచేసుకోవాలని సూచించారు. కావాలని తప్పుడు సమాచారం అందించినట్లయితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేందుకు ప్రజలంతా పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, డిప్యూటీ తహసీల్దార్ లాలు, బీఎస్ఓ బంగారు పద్మ మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు... జీవితమే ముద్దు

పల్లె వెలుగు: ఓ యువతా! మేలుకో. మత్తు చల్లే మాయలో పడకు. పచ్చని జీవితాన్ని బలిచేసుకోకు.



డ్రగ్స్ అనే విషవలయంలో చిక్కుకుని కన్నవారి కన్నీటికి కారణం కాకు. క్షణకాల మత్తు కోసం జీవితాన్ని నరకం చేసుకోకు. నీ ఆలోచనే దేశానికి బలం. యువశక్తే జాతీయ శక్తి. అయితే నేడు డ్రగ్స్ వినియోగం సమాజంలో ప్రమాదకర దురాచారంగా మారింది. చదువుల గుడిలోకి కూడా డ్రగ్స్ భూతం ప్రవేశించింది. ముక్కుపచ్చలారని చిన్నారుల జీవితాలను ఛిద్రం చేస్తూ, యువత ఉజ్వల భవిష్యత్తును బూడిద చేస్తోంది. ఆలోచనల పదును మందగించే ఈ వ్యసనం, మనుషులను జీవచ్ఛవాలుగా మార్చే మానసిక నరకం. సిరల్లో ప్రవహించాల్సింది ప్రగతి రక్తం. కానీ మత్తు పదార్థాల ప్రభావంతో శరీరం, మనసు క్రమంగా క్షీణిస్తాయి. కన్నవారి కలలు కరిగిపోతుంటే మౌనంగా ఉండకూడదు. జాతి యువ వనరులు నాశనమవుతుంటే నిర్లక్ష్యం చేయరాదు.

***డ్రగ్స్ కేంద్ర నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారితీస్తాయి. జీర్ణవ్యవస్థ దెబ్బతిని శరీరం బలహీనపడుతుంది. కాలేయంపై ఒత్తిడి పెరిగి పనితీరు దెబ్బతింటుంది. గుండె వేగంలో మార్పులు సంభవించి, గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. జ్ఞాపకశక్తి క్షీణించి, ఏకాగ్రత తగ్గిపోతుంది. ఒత్తిడి, ఆందోళన, హింసాత్మక ఆలోచనలు పెరిగి వ్యక్తి పురోగతికి అడ్డంకిగా మారతాయి. మెదడు దెబ్బతిని మూర్ఛ వంటి సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉంది.***

చరిత్ర చెబుతున్నట్లుగా, మత్తు పదార్థాల వినియోగం చాలా కాలంగా ఉన్నప్పటికీ, నేడు గంజాయి, హెరాయిన్ తదితర మాదక ద్రవ్యాలు వివిధ రూపాల్లో లభ్యమవుతూ యువతను ఆకర్షిస్తున్నాయి. ఫలితంగా అనేక మంది తమ బంగారు భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటున్నారు.

**కుటుంబ పెద్దలు పిల్లలపై ప్రేమతో కూడిన పర్యవేక్షణ కలిగి ఉండాలి. వారితో సమయం గడపాలి. వారి నిరాశలు, ఆందోళనలను అర్థం చేసుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలకు స్నేహితులుగా మారి, "మేమున్నాం" అనే భరోసాను కల్పించాలి. ప్రతి అడుగులో అండగా నిలిచి, వారి మనసులోని మాటలను వినాలి. ఒత్తిడిని దూరం చేసే ఇల్లే ఒక ధైర్యకోట అనే నమ్మకాన్ని వారికి ఇవ్వాలి.**

డ్రగ్స్ అనే మహమ్మారిని అడ్డుకోవాలంటే పోరాటం ప్రతి ఇంటి నుంచే ప్రారంభం కావాలి. డ్రగ్స్ పట్ల తల్లిదండ్రుల జాగరూకతే దేశానికి రక్షణ కవచం కావాలి. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో కుటుంబమే కీలక పాత్ర పోషించాలి. పిల్లలు మత్తుకు బానిస కాకుండా మమతల కోటలు కట్టాలి.ఓ యువతా! మత్తును వీడు... ప్రగతిని చూడు. లిలిడ్రగ్స్ వద్దు... జీవితమే ముద్దు.లిలి ఉజ్వల భవిష్యత్తును ఏలుకో. వ్యసనాల సంకెళ్లను తెంచి అభివృద్ధి బాట పట్టుదాం. మత్తులేని నవ సమాజాన్ని నిర్మిద్దాం. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు నడుం కట్టి, ఆరోగ్య భారత లక్ష్యంగా ముందుకు సాగుదాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు డ్రగ్స్ నిర్మూలన కోసం లిలి"ఈగల్"లిలి పేరుతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం అభినందనీయం. (జూన్ 26 -- అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా) -- నేదునూరి కనకయ్య

అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాజీ ఎన్ఎస్ఎస్ అధికారి మాజీ కరెస్పాండెంట్, జస్టిస్ కుమారయ్య లా కాలేజీ కరీంనగర్.

# పచ్చిరొట్టతో భూమికి రక్ష

## శాస్త్రవేత్త మంజునాథ్

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 25: భూమిలో సారం పెంచడానికి పచ్చి రొట్ట పైర్లు కీలక పాత్ర పోషిస్తాయని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మంజునాథ్, డి ఆర్ సి ఏ డి చెన్నయ్య అన్నారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామంలోని రైతు గురువారం రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ అధ్యక్షతన జరిగిన శిక్షణలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నైనో పరిస్థితుల్లో వరి పంటకు ప్రత్యామ్నాయంగా మినుము పెసర వంటి అపరాలు లేదా కొర్ర సజ్జ రాగి వంటి చిరుధాన్యాలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. భూమిలో ప్రారంభించడానికి పచ్చిరొట్ట పైర్లు కీలకపాత్ర పోషిస్తాయని, పచ్చి రొట్ట పైర్లు అయిన జీలుగ, జనుము, పిల్ల పెసర వంటి వాటిని సాగు చేయడం వల్ల నేల స్థితిలో మంచి మార్పులు వస్తాయని అన్నారు. చేనుకు చేవతోపాటు అన్నదాతలు అధిక లాభాలను పొందవచ్చునని అన్నారు. రసాయన



ఎరువుల వాడకాన్ని తగ్గి భూసారం పెరుగుతుందని అన్నారు. కేవలం 45 రోజుల వ్యవధిలోనే పచ్చిరొట్ట పూత దశకు చేరుకుంటుందని అన్నారు. వరి నాట్లు వేసే సమయానికి ఈ పంట అదునులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రసాయనిక ఎరువుల వాడకం గణనీయంగా పెరగడంతో భూమి నుంచి బయటకు అవసరమైన పోషకాలు లభించడం లేదని, వీటి శాఖ వల్ల భూమికి కావాల్సిన పోషకాలు అందుతాయని దీనితో పాటు నెలలో ఉష్ణోగ్రత సమతుల్యతకు దోహదం పడుతుందని వారు సూచించారు. భూమిలో కలుపు మొక్కల నివారణ జరుగుతుందని దీనితో పాటు మొక్కలకు కావాల్సిన అన్ని పోషకాలు లభిస్తాయి అని అన్నారు. కృత్రిమంగా వాడుతున్న నత్రజని వినియోగం తగ్గి రసాయన ఎరువులు భూమి అంతర పొరలకు చేరకుండా అడ్డుకట్ట వేయవచ్చునని అన్నారు. పచ్చిరొట్ట పైర్లు సాగు చేసిన రైతులు 40 నుంచి 50 రోజుల తర్వాత దున్నుపోవాలని అన్నారు. దీనివల్ల భూమికి తగినంత సేంద్రియ పదార్థం అందుతుందని అన్నారు. లెగ్యూమ్ జాతి పచ్చురట పంటలు గాలిలోని నత్రజనిని రూపంలో సేకరించి పొలంలో కలియ దున్నతంతో భూసారాన్ని పెంచుతాయని అన్నారు. వరి పంటను సాగు చేసే ప్రతి రైతు తప్పకుండా పచ్చి రొట్ట పంటలను సాగు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మా బీటీఎం ఉమామహేశ్వరి, వ్యవసాయ విస్తరణ అధికారుల లక్ష్మయ్య,వసుంధర, నామ్ కే బాయ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీ కుమార్, సౌజన్య తో పాటు రైతులు పాల్గొన్నారు.

# నేల పంట పరిరక్షణ మీద రైతులకు శిక్షణా కార్యక్రమం..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల





జిల్లా గడివేముల మండలం కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సమన్వయముతో, గడివేముల మండలం, గని గ్రామం నందు కేత్ భచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి భూమి పరిరక్షణ కై చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు రసాయనిక ఎరువులు విచక్షణ రహితంగా వేస్తూ పోతే భూమి ఆరోగ్యం దెబ్బతిని భవిష్యత్తులో భూమి వ్యవసాయానికి పనికి రాదని, కావున పచ్చి రొట్టె పైర్లు సాగు చెప్పట్టడం, భూసారా పరీక్షల ఆదారంగా ఎరువులు వాడటం, పంట అవశేశాలను కాల్చకుండా భూమిలో కలియ దున్నడం వంటి పద్ధతులు పాటించాలని సూచించారు. భూ విజ్ఞాన శాస్త్రవేత్త, రమణయ్య గారు భూసారా పరీక్షల ప్రాముఖ్యత మరియు పత్తి, మొక్కజొన్న, మిరప వంటి పంటల్లో ఎరువుల యాజమాన్యం, మరియు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రవి గౌడ్, పత్తి లో ఎల్నినో కు అనుగుణంగా చేపట్టాల్సిన పంటల సాగు పద్ధతులు, తక్కువ పంటకాల పరిమితి గల పత్తి రకాలపై అవగాహన కల్పించారు. అంతర పంట విధానాలు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మేలని తెలిపారు. పవన్ కుమార్, మండల వ్యవసాయ అధికారిలి వారు రైతులు తప్పకుండ నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంచుకొని వ్యవసాయం లో పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. పంట వ్యర్థాలను కాల్చకుండా, పొలం లో కలియదున్నీ నేల ఆరోగ్యం పెంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం యూరియా, డి ఏ. పి వంటి రసాయన ఎరువులు ఎపి ఏయిమ్స్ అనే యాప్ ద్వారా పంటకు శాస్త్రవేత్తల సూచనల మేరకు ఇవ్వబడును అని తెలిపారు. యూరియా కొరత లేదు మీకు అవసరం మేరకు వాడాలని సూచించారు.

ఈ కార్యక్రమం లో కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, రవి గౌడ్, మండల వ్యవసాయ అధికారి జి. కె. పవన్ కుమార్, గ్రామ ఉద్యాన సహాయకులు సుబేతుల్ల, స్వామి...గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మట్టంపల్లి గ్రామంలో దళిత బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

**?? దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి : తల్లమల్ల హసేన్**

సూర్యాపేట జిల్లా ప్రతినిధి – హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మట్టంపల్లి గ్రామంలో దళిత యువకుడిపై జరిగిన దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ తల్లమల్ల హసేన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కన్వీనర్ డప్పు మల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పలపల్లి చిరంజీవి, జిల్లా కన్వీనర్ నాగరాజు రత్నావత్‌లతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడుల విషయంలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. బాధితుల ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. .




# నరులతో వానరం "కోతి"నేస్తం

దొర్నిపాడు జూన్ 25 పల్లె వెలుగు న్యూస్ భూమి మీద బ్రతుకుచున్న చరాచర కోటి జీవరాసులలో వానరం ఒకటి, "కోతి" నోరులేని మూగ జంతువైన వానరం(కోతి) నరులతో నేస్తం చేస్తూ మనుషుల మధ్యకూర్చునిఅక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరచడం జరిగింది ,వివరాలు ఇలా ఉన్నాయి ,దొర్నిపాడు గ్రామంలో శివాలయం వద్ద కొందరు మనసులుగుమ్మికూడిమాటా,మంతిమాట్లాడుకుంటున్నారు, హఠాత్తుగాఎక్కడినుంచివచ్చిందో కానీ అక్కడికి ఒక వానరం" కోతి" వచ్చి వారి మధ్య మౌనంగా కూర్చుంది ఇది చూసిన





వారంతా ఆశ్చర్యపడుతూ మనకంటే జంతువులే మేలు, మన మీద నమ్మకంతో మన దగ్గర ధైర్యంగా కూర్చుంది అనుకున్నారు, అన్ని జన్మలలో కెల్లా మానవజన్మ ఉత్తమమైనది అంటారు, కానీ మనుషుల మధ్య ప్రేమానుబంధాలు చాలా తక్కువ ఎప్పుడు కక్షలు ద్వేషాలు పెంచుకుంటూ మానవత్వం మరిచి ఒకరి పట్ల ఒకరికి విశ్వాసం లేకుండా జీవిస్తున్నారు, విశ్వాసానికి, మానవత్వానికి నిదర్శనంగా వానరం" కోతి" నరులతో నేస్తం చేసింది, మనుషులంటే జంతువులకు భయం,ఎక్కడ కొడతారో నని కానీ ఎలాంటిభయం లేకుండా ధైర్యంగా మనుషుల చెంతనే కూర్చుంది అక్కడున్న వారందరూ ఆశ్చర్య పడ్డారు మనసు లకులేని విశ్వాసం జంతువులకు ఉందని నిరూపించుకుందిఈకోతి"వానరం"

# హోస్పేట్ బహిరంగ సభలో పాల్గొన్న ఆదోని టిడిపి నాయకులు

**తెలుగుదేశం పార్టీ ఆదోని ఇన్చార్జి మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో.**





ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో ఆదోని నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆదోని నియోజకవర్గంలోని వివిధ మండలాలు, పట్టణాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# మొహర్రం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి..



పాణ్యం జూన్ 25 పల్లె వెలుగు : మండలంలోనీ గోరుకల్లు గ్రామంలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పాల్గొన్నారు. హిందూ ముస్లింలు కలిసి మెలిసి ప్రశాంతంగా పండుగలు నిర్వహించుకోవాలనీ ఆమె సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో కూడా



మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మొహరం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎద్దుల బల ప్రదర్శన పోటీలో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే, గ్రామ నాయకుల చేతులమీదుగా నగదును బహుమతి అందజేశారు.కార్యక్రమంలో గ్రామ నాయకులు నంద్యాల రవికుమార్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి ,సురేష్, రామ హుస్సేన్, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి ఇతర గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వివాహానికి పదివేలు ఆర్థిక సాయం



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నులక చందనం పగులయ్య కుమార్తె సునీత వివాహానికి తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్చార్జి నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాల వివాహాలకు తమ చేతనైన సహాయం చేయడంలో ఎంతో సంతోషం వుందని తెలియజేసారు.వారి వైవాహిక జీవితం ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని తెలియజేశారు.ఎవరికి ఆపద వచ్చిన తన వంతు సహాయంగా ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు.

# 3.7 టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేత





మహానంది, పల్లె వెలుగు బుక్కాపురంలో రూ.1,43, 800 విలువచేసే 3.7 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి,విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై వెంకట ప్రసాద్ తెలిపారు. గురువారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఎరువులు పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు.ఏవో మాట్లాడుతూ..మండలంలోని ఎరువుల డీలర్లు ఎరువుల నియంత్రణ చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని ఆదేశించారు.ఎరువులను బస్తా పైన ఉన్న ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డీలర్లు ఏపీఎఐఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువులను అమ్మాలన్నారు.స్టాక్ రిజిస్టర్ లో నిల్వలకు, భౌతికంగా ఉన్న నిలువలకు, ఈపాస్ మిషన్ నిల్వలు, ఏపీ ఏఐఎంఎస్ యాప్ లో ఉన్న నిల్వలకు అన్ని సమానంగా ఉండాలన్నారు.ఫారం ఓ లను లైసెన్స్ లో ఇంక్లూడ్ చేసుకోవాలని తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలలో యూరియా, డిఏపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు.

# డోన్ ఎమ్మెల్యే కోట్ల కు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు



బేతంచెర్ల పల్లెవెలుగు ప్రతినిధి ( జూన్ 25 ):-- బేతంచెర్ల మండలం ఆర్.ఎస్ )రంగాపురం లోని కొండపేట లో నూతన సీసీ రోడ్డు పనులు గురువారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ...మేము సీసీ రోడ్డు లేక నానా ఇబ్బందులకు గురి అయ్యమన్నారు. మా సమస్య డోన్ ఎం ఎల్ ఏ కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి ద్రుష్టి కి వెళ్ళగా, ఆయన చోరువతో మండల టీడీపీ కన్వీనర్ ఉన్నం. ఎల్ల నాగయ్య సహకారం తో 10లక్షల రూపాయల వ్యయం తో నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించరన్నారు. దింతో డోన్ ఎం ఎల్ ఏ కొట్ల కు మరియు ఎల్ల నాగయ్య కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో నంద్యాల జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతిని ధి లొడ్డ. శేఖర్, టీడీపీ నాయకులు ఎల్లయ్య ఈ ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మంచి ఆశయంతో ముందుకు సాగాలి

**- జిల్లా లీగల్ అండ్ ప్రొహిబిషన్ అధికారి సుదర్శన్ రెడ్డి**





ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 25, పల్లె వెలుగు జీవితం చాలా విలువైనదని మత్తుపదార్థాలకు అలవాటు పడకుండా, వ్యక్తిగత శుభ్రత కలిగి మంచి పోషకాహారం తీసుకుంటూ మంచి ఆశయంతో ముందుకు సాగాలని జిల్లా లీగల్ అండ్ ప్రోహిబిషన్ అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆళ్లగడ్డ పట్టణం లోని బి సి బాయ్స్ హాస్టల్ లో ఐసీడీఎస్ సూపర్వైజర్ దస్తగిరమ్మ ఆధ్వర్యంలో నిషా ముక్త్ భారత్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు మత్తుపదార్థాలకు అలవాటు పడవద్దని, వాటి వలన కలిగే నష్టాలను వివరించారు. మంచి క్రమశిక్షణతో మెలగాలని, ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా ముందుకు సాగాలి తప్ప వత్తిడిలను ఎదుర్కోలేక ఆత్మహత్య చేసుకోవడం పరికరం కాదన్నారు. పిల్లలు ఉన్నతమైన ఆశయాలతో ముందుకు సాగాలని ఆయన తెలిపారు.

# రాష్ట్రం లో దళితుల మీద జరిగిన దాడులపై ఉక్కుపాదం మోపుతున్న కూటమి ప్రభుత్వం

- విజయలక్ష్మి
- కూటమి యస్ సి చట్టాలు కఠినంగా అమలు చేయడం హర్షించదగ్గ విషయం

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 25 రాష్ట్ర ప్రభుత్వం దళితుల మీద దాడులు పై అధికారులు ఎప్పటికి అప్పుడు సమీక్షలు సర్వే లు చేపడుతూ చట్టాలను కఠినంగా అమలు చేయడం లో కూటమి విజయవంతం అయిందని విజయలక్ష్మి అని పత్రికా ముఖంగా తెలిపారు.తప్పు చేసిన అధికారులను సైతం జైళ్లకు పంపుతున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని అట్రాసిటీ కేసుల విచారణ లో ఎలాంటి రాజకీయ ప్రలోబలు లేకుండా నిష్పక్షపాతంగా చేసి బాధితులకు అండగా ఉండటం చంద్రబాబు బాబు పాలనకే సాధ్యం అని ఆమె తెలిపారు."రాష్ట్రంలో మాదిగలపై దాడులు జరిగిన ప్రతి ఘటనపై కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించిందని నిందితులపై కేసులు నమోదు చేసి, అరెస్టులు చేసి,




బాధిత కుటుంబాలకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని ఆమె తెలిపారు.గత ఐదేళ్లలో దళితులు, బీసీలు, మైనార్టీలపై జరిగిన దాడుల సమయంలో వైసీపీ ప్రభుత్వం ఎందుకు మౌనం వహించిందని విజయలక్ష్మి ప్రశ్నించారు.దళిత యువకుడు డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, వరప్రసాద్, కిరణ్ వంటి ఘటనల్లో ఎందుకు న్యాయం జరగలేదు?ఈరోజు మా పాలపై మా నాయకులపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అని ఆమె ఏద్దేవా చేశారు.దళితుల హత్యలు చేసిన నాయకులను ఎందుకు వైసీపీ పార్టీ సస్పెండ్ చేయలేదు అని ఆమె విమర్శించారు. ఇదే దళితులపై వైసీపీ కి ఉండే చిత్తశుద్ధి అని ఆమె తీవ్రంగా మండిపడ్డారు.గత వైసీపీ పాలన లో దళితుల పై జరిగిన దాడులతో పోలిస్తే ఈ రెండేళ్ల కూటమి పాలన లో 25% క్రైం రేట్ తగ్గింది అని సాక్షత్తు కేంద్రం విడుదల చేసిన రిపోర్ట్స్ చెప్తున్నాయ్ అని విమర్శలు మాని నిజాలు తెలుసుకోవాలని ఆమె తెలిపారు.

# మున్సిపల్ కాంట్రాక్టర్ కురువ రంగయ్య పై దాడి అమానుషం. (గడివేముల మండల కురువ సంఘం కమిటీ)..

కర్నూల్ పట్టణంలోని మున్సిపల్ కాంట్రాక్టర్ కురువ రంగయ్య పై కొంతమంది నాయకులు



అక్రమంగా దాడి చేయడాన్ని గడివేముల మండలం కురువ సంఘం కమిటీ తీవ్రంగా ఖండించింది. పాణ్యం నియోజకవర్గం గడివేముల మండల పరిధిలోని బిలకల గూడూరు గ్రామం కురువ సంఘం కార్యాలయంలో గురువారం నాడు ఉమ్మడి కర్నూలు జిల్లా కురవ సంఘం సహాయ కార్యదర్శి ఒగ్గు రామకృష్ణ, కార్యవర్గ సభ్యుడు కె పాపారాయుడు, ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకం దారుల సంఘం డైరెక్టర్ యుగంధర్, మండల సెక్రెటరీ శ్రీనివాసులు, ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు




మాట్లాడుతూ జిల్లాలో కురువ కులస్తులపై దాడులు పెరిగిపోతున్నాయని వారు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, కర్నూలు పట్టణంలో 40 సంవత్సరాలుగా మునిసిపల్ కాంట్రాక్టర్ గా పనిచేస్తున్న కురువ రంగయ్య పై గత వారం రోజుల క్రితం కొంతమంది దుండగలు అక్రమంగా దాడి చేయడం దారుణమని అన్నారు. కర్నూల్ పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో లెస్ టెండర్లు భాగంగా 50 లక్షల విలువైన పనులను కాంట్రాక్టర్ రంగయ్య చేస్తున్నారని ,దీనికి గాను ఐదు లక్షల కమిషన్ తమకు ఇవ్వాలంటూ కొంతమంది నాయకులు దాడి చేయడం దారుణమని తెలిపారు. కర్నూలు పట్టణంలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో మున్సిపల్ కాంట్రాక్టర్లు వ్యాపారస్తులు భయాందోళనలో ఉన్నారని ఇటువంటి పరిణామాలతో కొంతమంది కాంట్రాక్టర్లు పనులు చేయలేక పోతుండడంతో ఇలాగైతే కాంట్రాక్టర్లు పనులు ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు. గాయపడిన బాధితుడు కాంట్రాక్టర్ రంగయ్య ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి ఎమ్మెల్సీ చేయించుకున్న వాటి ఆధారంగా మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన అక్కడ సరైన స్పందన లభించకపోవడంతో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఫలితం దక్కలేదని వారు తెలిపారు. ఇప్పటికైనా పోలీసు వారు స్పందించి కాంట్రాక్టర్ కురువ రంగయ్య పై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన కేసు నమోదు చేయాలని లేని పక్షంలో జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ, కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు, గొర్రెల పెంపకం దారుల సంఘం డైరెక్టర్ యుగంధర్, తో పాటు గడివేముల మండల కురవ సంఘం సభ్యులు కే వెంకటేశ్వర్లు, కే చంద్రశేఖర్, వెంకటస్వామి, ఎం శివుడు, ఎం శ్రీరాములు, ఎల్లా రాముడు ,రామ మద్దిలేటి,శివ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నిర్వహణకు సమిష్టిగా పనిచేయాలి

- ఓటర్లకు, బిఎల్వోలకు నాన్-బిఎల్వోలు సహకారం అందించాలి
- కర్నూలు ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు స్వర్ణ వార్డు కార్యాలయాల ఉద్యోగులు సమిష్టిగా పనిచేయాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. గురువారం స్వర్ణ వార్డు కార్యాలయాల అడ్మిన్, ప్లానింగ్, అమినిటీస్, శానిటేషన్, వెల్ఫేర్, రెవెన్యూ, ఏఎన్ఎం కార్యదర్శులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియలో అత్యల్ప పురోగతి ఉన్న బిఎల్వోలతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఈఆర్వో చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు స్వర్ణ వార్డు కార్యాలయాల్లో పనిచేస్తున్న కార్యదర్శులందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. బిఎల్వోలతో పాటు నాన్-బిఎల్వోలు సైతం ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని కోరారు.బిఎల్వోలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం కార్యాలయాలకు వచ్చే ఓటర్ల సందేహాలను నివృత్తి చేయడం, ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం, అవసరమైన సమాచారం అందించడం వంటి పనులను తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితా పరిశీలన, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, తిరిగి వాటిని డిజిటలైజ్ చేయడాన్ని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ ఈఆర్వోలు, అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, ఎన్నికల సూపరింటెండెంట్ సుబ్బన్న, సూపర్వైజర్లు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూల్ నుండి ఆదోని ప్రాంతానికి తగినన్ని బస్సులు నడపకపోవడం సిగ్గుచేటు

**-నూర్ అహ్మద్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి.**

ఆదోని (పల్లె వెలుగు): కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి జిల్లాలో అధిక వైశాల్యం కలిగిన ఆదోని ప్రాంతానికి అధికారులు తగినన్ని బస్సులు నడపక పోవడం దుర్మార్గం మరియు అమానుషం. మరీ ముఖ్యంగా సాయంత్రం 4 గంటల నుండి రాత్రి వరకు ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ మరియు మంత్రాలయం నియోజకవర్గాలకు అతి తక్కువ బస్సులు మాత్రమే వెళ్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు మరియు మహిళల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. పేరుకే కర్నూల్ జిల్లా కేంద్రం కాని కర్నూల్ నుంచి నంద్యాల జిల్లా వైపు వెళ్లేందుకు తగిననన్ని బస్సులు అందుబాటులో ఉంచారు కానీ సొంత జిల్లాలో భాగం అయిన ఆదోని ప్రాంతానికి బస్సులు నడపక అధికారులు సవతి తల్లి ప్రేమ చూపడం దారుణం. దీనిని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి తీవ్రంగా ఖండిస్తున్నది. కావున ప్రజల కష్టాలు దృష్టిలో ఉంచుకుని తమ బాధ్యతగా ఆర్ టి సి అధికారులు ఆదోని ప్రాంతానికి విరివిగా బస్సులు నడపాలని డిమాండ్ చేస్తున్నాము. లేని యెడల అధికారుల నిర్లక్ష్యం పై ఉన్నతాధికారులు మరియు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్తామని హెచ్చరిస్తున్నాము. మరో పక్క కర్నూల్ బస్సు స్టాండ్ ఇరుకుగా మారింది మరియు బస్సులు పరస్పరం ఢీకొనడం లేదా ప్రయాణికులను కూడా ఢీ కొట్టి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది కావున బస్సు స్టాండ్ ను విస్తరించడమా లేక ఆదోని రోడ్డుకు బస్సు స్టాండ్ ను తరలించడమా ఏదో ఒకటి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము.

ఈ కార్యక్రమంలో నాయకులు నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంఘం 23వ రాష్ట్ర మహాసభ లను జయప్రదం చేయండి.

**రాష్ట్ర మహా సభల పోస్టర్లను విడుదల చేసిన రైతు సంఘం నాయకులు.**





పల్లెవెలుగు బేతంచెర్ల( జూన్ 25):-ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర 23 వ మహాసభలు వచ్చే జులై నెల 3,4,5 తేదీలలో ఏలూరులో జరుగ నున్నాయి. రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లాల నుండి 500 మంది రైతు ప్రతినిధులు, అఖిల భారత రైతు సంఘాల నాయకులు, ఈ మహా సభలకు హాజరవుతారు..ఎపి రైతు సంఘం ( ఎఐకెఎస్) బేతంచెర్ల మండల కమిటి ఆధ్వర్యంలో రాష్ట్ర మహా సభల వాల్ పోస్టర్లను,ఆ సంఘం కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా,రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.లంక సుబ్బరాయుడు,రైతుసంఘం బేతంచెర్ల మండల కార్యదర్శి పి.రామ మోహన్ లు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలంలో దేశంలోనే మొట్ట మొదటి సారిగా, ఆంధ్ర ప్రాంతంలోని ఏలూరులో, 1893 సం.లో రైతు మహాసభ జరిగింది.1996 లో ఆచార్య ఎన్.జి.రంగా,స్వామి సహజా నంద సరస్వతి వంటి రైతాంగ యోధుల ఆధ్వర్యంలో,అఖిల భారత కిసాన్ సభ ( ఎఐకెఎస్ ) ఏర్పడింది.బ్రిటీష్ దోపిడి,అధిక పన్నులకు వ్యతిరేకంగా, అనేక రైతాంగ ఉద్యమాలు సాగాయి.1937-38లో ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షులు అమరజీవి కొమ్మారెడ్డి సత్య నారాయణ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి అమరజీవి చలసాని వాసు దేవ రావుల నాయకత్వంలో, రైతాంగాన్ని చైతన్య పరుస్తూ, ఇచ్చా పురం నుండి మద్రాసు వరకు చారిత్రాత్మక రైతు రక్షణ యాత్ర సాగింది.అమరజీవి ఉద్ధ రాజు రామం నాయకత్వంలో, కాళీ పట్నం జమిందారీ వ్యతిరేక పోరాటంతో పాటు మందస, చల్లపల్లి, మునగాల, ఎల్లారెడ్డి, పెదనందిపాడు,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల వంటి, పోరాటాలు పెద్ద ఎత్తున సాగాయి. ఫలితంగా జమీందారి,ఈనాం దారి వంటి వ్యవస్థలు రద్దయ్యాయి.రైతాంగం దోపిడి, పీడన నుండి విముక్తులయ్యారు.1954 లో ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం,రాష్ట్రం లోని రైతు ఉద్యమాల వేదికగా,అప్పటి నుండి ఇప్పటి వరకు,అన్నిరకాల పంటలకు గిట్టుబాటు ధరల కోసం,నాణ్యమైన విత్తనాలు,ఎరువుల,పురుగు మందుల కోసం, రైతుల పక్షాన పోరాటాలు చేస్తున్నది. 2026 జులై 3,4,5 వ తేదీలలో, ఏలూరులో జరిగే రాష్ట్ర మహాసభల్లో వ్యవసాయ,పారిశ్రామిక,ఉపాధి రంగాలను కాపాడుకునేందుకు తగు నిర్ణయాలు ఉంటాయని, కనుక పెద్దలు,ప్రముఖులు,రైతు శ్రేయోభిలాషులు,అన్ని పంటల రైతాంగం,వర్తక-వాణిజ్య వర్గాలు, వివిధ సంస్థలు,ఉద్యోగులు, వ్యవసాయ సంభంద అన్ని శాఖల అధికారులు,వ్యవసాయ శాస్త్ర వేత్తలు,కవులు,కళాకారులు,రచయితలు ఆందరూ ఈ మహా సభల నిర్వహణకు ఆర్ధిక, హార్ధిక సహకారం అందించ వలయునని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైతు నాయకులు అంబాపురం రాజేంద్ర,బి.సుమలత,గోర్లగుట్ట మైల వెంకటేశ్వర్లు,బేతంచెర్ల జె.బాలాజీ పాల్గొన్నారు.

# SIR ప్రక్రియపై పారదర్శకత పాటించాలి: బుగ్గన అర్జున్ రెడ్డి



బేతంచర్ల జూన్ 25 (పల్లెవెలుగు):- బేతంచెర్ల మండలంలో కొనసాగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ (ా×=) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా వైసీపీ శ్రేణులు, బీఎల్ఏలు అప్రమత్తంగా వ్యవహరించాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు, యువ నాయకులు బుగ్గన అర్జున్ రెడ్డి పిలుపునిచ్చారు. బేతంచెర్ల పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన వైసీపీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ా×= ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలు, బీఎల్ఏల బాధ్యతలు, ఓటరు జాబితా సవరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా బుగ్గన అర్జున్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటరు జాబితా సక్రమంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ప్రతి బూత్ పరిధిలో పర్యటించి ఓటరు జాబితాను సవరిస్తారని తెలిపారు. ఆ సమయంలో బీఎల్ఏలు తప్పనిసరిగా వారితో పాటు ఉండి ప్రతి దశను పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన యువత, మహిళలు, వలసదారుల పేర్లు జాబితాలో చేరేలా చూడాలని, అదే సమయంలో మృతి చెందిన వారు, డబుల్ ఎంట్రీలు, తప్పుడు చిరునామాలు ఉన్నవారి పేర్లను తొలగించే ప్రక్రియలోనూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల సమయంలో అది పెద్ద సమస్యగా మారుతుందని హెచ్చరించారు. ా×= ప్రక్రియలో ఏమైనా అవకతవకలు జరిగినట్టు గుర్తిస్తే వెంటనే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్‌లో పార్టీకి బలమైన బీఎల్ఏ ఉండేలా చూడాలని, వారికి పూర్తి శిక్షణ ఇచ్చి ప్రక్రియపై అవగాహన కల్పించాలని పార్టీ మండల నాయకత్వానికి సూచించారు.
ఓటరు జాబితా సవరణ అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ఇది ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ బూత్‌లకు చెందిన బీఎల్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎంకు కులం ఆపాదించడం తగదు

**● గూడూరు జనసేన నేతల హెచ్చరిక ●**

**డిప్యూటీ సీఎంపై వైసీపీ నేతల ఆరోపణలు దుర్మార్గం**






పల్లె వెలుగు ప్రతినిధి (గూడూరు, జూన్ 25, గురువారం) : డిప్యూటీ సీఎంకు కులాలు ఆపాదించడం ? తగదని జనసేన నాయకులు హెచ్చరించారు. గూడూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సుందర్ మహల్ థియేటర్ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు కొణిదల ముని గిరీష్, పేటేటి చంద్రనీల్, నయీమ్, ఇంద్రవర్ధన్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జాతీయ భావాలు కలిగి, దేశభక్తితో అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న వ్యక్తి అని, అటువంటి వ్యక్తికి కులాన్ని ఆపాదించి పబ్బం గడుపుకోవాలని చూడటం వైసీపీ నాయకుల దుర్మార్గపు చర్య అని విమర్శించారు. పవన్ కళ్యాణ్ ను కేవలం ఒక కులానికి మాత్రమే పరిమితం చేయాలని చూస్తూ, సదరు పార్టీ నేతలు ఒక రౌడీ షీటర్ ను వెనకేసుకొస్తూ చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దళిత డాక్టర్ హత్య, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య, అమర్నాథ్ గౌడ్ దహనం వంటి ఘటనల్లో నిందితులను వెనకేసుకొచ్చిన చరిత్ర వారిదని ధ్వజమెత్తారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, సాయికృష్ణ విషయంలో తప్పు జరిగితే ఇప్పటికే సీఐని సస్పెండ్ చేశామని, సిట్ విచారణ కూడా జరుగుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజు, అవినాష్ శివ, వేమా భాస్కర్ చైతన్య, కనుపూరు మధు, మల్లికార్జున్, చిల్లకూరు నాయకులు జమాల్ బాషా, కొట్టే రాజేష్, మణి, శ్రీను, పరశురాం, వాకాడు నాయకులు చంద్రశేఖర్, మున్నా, చిట్టమూరు నాయకులు భార్గవ్, కోట నాయకులు అల్లం బాబు, గూడూరు రూరల్ నాయకులు హుస్సేన్, పట్టణ నాయకులు చలగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పెంచలకోన పుణ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పల్లె వెలుగు విలేకరి (రాపూరు, జూన్ 25, గురువారం) : ప్రముఖ పుణ్యక్షేత్రం రాపూరు మండలంలోని పెంచలకొన క్షేత్రంలో వెలసియున్న శ్రీపెనుశీల లక్ష్మీ నరసింహస్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంలో స్వామి వార్ల జన్మ నక్షత్రం సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు స్వామి వారికి అభిషేకం. తొమ్మిది గంటలకు శాంతిహోమం, అనంతరం శ్రీవార్లకు నిత్య కళ్యాణ మండపంలో కళ్యాణము, సాయంత్రం శ్రీవార్లకి బంగారు గరుడ వాహనం, ప్రధానార్చకులు, వేదపండితులు, గిరిజన వాయిధ్యాలు, మంగళ వాయిద్యాలు నడుమ దేవస్థానంకార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలోఅత్యంత వైభవంగా నిర్వహించి భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్యూలైన్ ఏర్పాటు, మంచినీరు సరఫరా, అన్నదానం కార్యక్రమం దేవస్థానం ఈఓ పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి స్పూర్తితో అంతక్రియలకు ఆర్థిక సాయం

**- మానవత్వం చాటుకున్న కాంట్రాక్టర్ బసవరాజు.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలం పెద్ద తుంబళం గ్రామం కురువ చుండి ఈరన్న



అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు కాంట్రాక్ట్ బసవరాజు కురువ చుండి ఈరన్న పార్థ దేహానికి పూలమాలతో నివాళులర్పించి. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి వైఎస్ఆర్సిపి పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేశారు కురువ చుండి ఈరన్న అంతక్రియలకు మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి స్పూర్తితో అంతక్రియలకు వై ఎస్ ఆర్ సీపీ సీనియర్ నాయకుడు కాంట్రాక్ట్ బసవరాజ్ 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. చుండి ఈరన్న కుటుంబ సభ్యులు కాంట్రాక్ట్ బసవరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె అంజన్ రెడ్డి, బుడ్డప్ప, పూజారి హుసేని, కే రామిరెడ్డి, చిన్న ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్




రంగారెడ్డి శంషాబాద్ పల్లె వెలుగు ప్రతినిధి కార్యక్రమం (ా×=)ను గ్రామ సర్పంచ్ శ్రీ గడ్డం శేఖర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీూలకు పలు సూచనలు చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాలని, వివరాల సవరణలు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీ నీరటి మహేష్, మాజీ ఎంపీటీసీ తొంట గౌతమి అశోక్,వార్డు సభ్యులు చౌట రాజు, పర్వతం వెంకటయ్య, కనకమామిడి విష్ణు, లింగం సంధ్య-నవీన్, పర్వతం వినోద్, గూడెపు నీరజ-లక్ష్మణ్, పులిమామిడి షాలిని-శ్రీకాంత్, కర్రె అఖిల-గణేష్, నాయకులు టి. కుమార్ గౌడ్, గ్రామస్థులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# జూలై ఒకటిన గూడూరులో చంద్రబాబు పర్యటనకు సన్నాహాలు



పల్లె వెలుగు ప్రతినిధి(గూడూరు, జూన్ 25, గురువారం) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జూలై ఒకటో తేదీన గూడూరు నియోజకవర్గంలో పర్యటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు అధికారికంగా ముందస్తు సమాచారం అందడంతో జిల్లా యంత్రాంగం, స్థానిక తెలుగుదేశం పార్టీ శ్రేణులు అప్రమత్తమయ్యాయి. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై గురువారం గూడూరు ఆర్డీవో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారైతే, చిల్లకూరు మండలం పునపరవారిపాలెం పంచాయతీలో జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యటనకు అనువైన మూడు ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు వెల్లడించారు. సమీక్షా సమావేశం అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. చిల్లకూరు మండలం పునపరవారిపాలెం, గూడూరు పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌తో పాటు మరో ప్రదేశాన్ని ప్రాథమికంగా పరిశీలించామన్నారు. వీటిలో భద్రతా పరంగా, ప్రజా సౌకర్యాల దృష్ట్యా ఏది అనుకూలంగా ఉంటుందో త్వరలోనే ఖరారు చేస్తామని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో భాగంగా లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీతో పాటు, ప్రజా వేదిక కార్యక్రమం, పార్టీ కార్యకర్తలతో సమావేశం ఉండే అవకాశం ఉంది. హెలిపాడ్ ఏర్పాటు కోసం కూడా స్థలాలను పరిశీలిస్తున్నామని, జెసి చెప్పారు. అయితే, దీనిపై ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక పర్యటన షెడ్యూల్ రావాల్సి ఉంది. ఈ సమావేశంలో పలువురు తహసీల్దార్లు, స్థానిక అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా వేంకటేశ్వర స్వామి ధ్వజారోహణం



పల్లె వెలుగు ప్రతినిధి (గూడూరు, జూన్ 25, గురువారం) : గూడూరులోని రాజావీధిలో వెలసియున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి అంకురారోపణ కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. మంత్రోచ్ఛారణల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలను ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీకంటి రామమోహన్ రావు, సభ్యులు పర్యవేక్షించారు.

# అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



రాజమండ్రి, జూన్ 25 పల్లె వెలుగు దినపత్రిక) :- తూర్పుగోదావరి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలను అరికట్టాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ నిబంధనలను ఉల్లంఘిస్తూ జరుగుతున్న తవ్వకాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను, ఫోటోలను కలెక్టర్ ముందు ఉంచారు. పర్యావరణానికి హాని కలిగిస్తూ, ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్న ఈ అక్రమ రవాణాపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ అక్రమ తవ్వకాలను ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు పాల్పడటమే కాకుండా, ఫిర్యాదు చేసిన వారిపైనే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు. అక్రమ తవ్వకాల వల్ల ఎదురవుతున్న సమస్యలను సాక్ష్యాధారాలతో సహా కలెక్టర్‌కు వివరించినట్లు పార్టీ నేతలు తెలిపారు

# పల్స్ పోలియోను విజయవంతం చేయాలి - ఎంపీడీవో బి.రాజేశ్వరరావు



కాట్రేనికోన, జూన్ 25 పల్లె వెలుగు దినపత్రిక) :- జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై విజయవంతం చేయాలని మండల పరిషత్ అధికారి బి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించడం ద్వారా వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. నిండు జీవితానికి పల్స్ పోలియో చుక్కలు పునాది వంటివని, తల్లిదండ్రులు బాధ్యతగా పిల్లలను కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. మండలంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో శిబిరాలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాట్రేనికోన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఎం లిఖిత, మలేరియా యూనిట్ అధికారి కె రామ్మోహన్రావు, సూపర్వైజర్ జే వి రమణమ్మ, పబ్లిక్ హెల్త్ నర్స్ జి రామశేషులు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మైనార్టీల పక్షపాతి - మైనారిటీ నాయకులు



రాజమహేంద్రవరం, జూన్ 25 పల్లె వెలుగు దినపత్రిక) :- రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌పై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ఆయనపై నగర ప్రజల్లో విశేష ఆదరణ ఉందని కూటమి ముస్లిం మైనారిటీ నాయకులు స్పష్టం చేశారు. గురువారం రాజేంద్రనగర్ సచివాలయం వద్ద వారు మీడియా సమావేశం నిర్వహించి, ఎమ్మెల్యేపై జరుగుతున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. మైనారిటీ నాయకుడు అస్లాం మాట్లాడుతూ, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మైనారిటీ సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. ఉర్దూ అకాడమీ భవన పునరుద్ధరణ, మసీదుల అభివృద్ధికి సొంత నిధులతో సహకారం, రంజాన్ పర్వదినాల్లో మమేకమవ్వడం ఆయన సేవాభావానికి నిదర్శనమని కొనియాడారు. బరియల్ గ్రౌండ్ కమిటీ అధ్యక్షుడు షేక్ అమీర్ రాజా మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన బరియల్ గ్రౌండ్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేశారని తెలిపారు. జనసేన మైనారిటీ నాయకులు బాషా లిమ్రా మాట్లాడుతూ, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నగర అభివృద్ధికి భారీ ప్రాజెక్టులు తీసుకొస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యే భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మసీదులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చాన్ బాషా, సయ్యద్ అప్సరి, ఎస్ కే బషీర్, జనసేన బషీర్, మహబూబ్ ఖాన్, మహమ్మద్ బాబా ఖాన్, మదీనా సాహెబ్, సత్తార్, అహ్మద్ ఉన్నిషా, భాష, అశ్వర్ ఖాన్, బషీర్, షబ్బీర్ పాల్గొన్నారు

# మహిళా భద్రత, ప్రతి ఒక్కరి బాధ్యత - ఎస్పీ ఏవీ సుబ్బరాజు



రాజమహేంద్రవరం, జూన్ 25 (పల్లె వెలుగు దినపత్రిక) :- తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, రాజమహేంద్రవరం ఆదిత్య కళాశాలలో మహిళా భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ లా అండ్ ఆర్డర్ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ, మహిళల రక్షణలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. యువతులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, వేధింపులు, ర్యాగింగ్ వంటి ఘటనలపై అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. శక్తి యాప్ వినియోగం, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని, లోన్ యాప్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అత్యవసర సహాయం కోసం పోలీస్ ఎమర్జెన్సీ 112, మహిళా హెల్ప్‌లైన్ 181, సైబర్ క్రైమ్ 1930, డ్రగ్స్ హెల్ప్‌లైన్ 1933, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె మంగాదేవి, శక్తి టీమ్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

## సీతానగరంలో ఘనంగా వేణుగోపాలస్వామి వార్షికోత్సవం



సీతానగరం, జూన్ 25 (పల్లె వెలుగు, దినపత్రిక) :- మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత వే ణు గో పా ల స్వా మి ఆలయంలో స్వామి వారి వార్షిక మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి ఏటా వైశాఖ మాసంలో నిర్వహించే ఈ ఆధ్యాత్మిక ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఏఈ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల పుష్పాలతో, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానికంగా ఉన్న భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో భక్తిభావం, ఆధ్యాత్మిక చింతన పెంపొందుతుందని పలువురు భక్తులు పేర్కొన్నారు

# విఘ్నేశ్వరుడి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కిర్లంపూడి, జూన్ 25 (పల్లె వెలుగు దినపత్రిక) :- కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన వినాయక ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణనాథుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ విఘ్నాధిపతి ఆశీస్సులతో గెద్దనాపల్లి గ్రామ ప్రజలు, నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఐక్యత, సాంస్కృతిక వైభవం పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండల టీడీపీ అధ్యక్షులు వీరం రెడ్డి కాశిబాబు, సూరిశెట్టి వెంకట శివ, బీశెట్టి సూరిబాబు, బుర్రి శ్రీను, అధిక సంఖ్యలో భక్తులు, కూటమి నాయకులు పాల్గొన్నారు

# మహిళలకు మార్కెటింగ్ నైపుణ్యాలపై శిక్షణ



తాళ్లరేవు, జూన్ 25 (పల్లె వెలుగు దినపత్రిక) :- కాకినాడ జిల్లా తాళ్లరేవులోని మాధవరాయునిపేట క్షేత్ర కార్యాలయంలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో ఎంబ్రాయిడరీ శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులకు మార్కెటింగ్ నైపుణ్యాలు మరియు సూక్ష్మ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే మార్కెటింగ్ నైపుణ్యాలు పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకుని స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని ఆమె తెలిపారు. బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్ట్ సమన్వయకర్త ఆర్. లోవరాజు మాట్లాడుతూ, ఏదైనా సూక్ష్మ యూనిట్ ప్రారంభించే ముందు మార్కెటింగ్ అవకాశాలపై క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి అని సూచించారు. యూనిట్ల స్థాపన తర్వాత నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు, వాటికి మార్కెట్‌లో గల గిరాకీని గుర్తించి విక్రయించుకోవాలని ఆయన వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండలి సిబ్బంది, ఎంబ్రాయిడరీ శిక్షణార్థులు మరియు యువతులు పాల్గొన్నారు. మార్కెటింగ్ మెలకువలు నేర్చుకోవడం వల్ల తయారీ రంగంలో మహిళలు రాణించే అవకాశం ఉందని వక్తలు ఉద్ఘాటించారు

## అంతర్జాతీయ యోగా పోటీల్లో స్వర్ణం గెలిచిన మంద మానస



తాళ్లరేవు, జూన్ 25 (పల్లె వెలుగు, దినపత్రిక) :- కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలానికి చెందిన మంద మానస శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకాన్ని సాధించి దేశ కీర్తిని చాటింది. ఐదవ తరగతి నుంచే యోగాపై ఆసక్తి పెంచుకున్న మానస, తన యోగా గురువు బోది నాగరాజు వద్ద శిక్షణ తీసుకుని ఈ స్థాయికి చేరుకుంది. జిల్లా మరియు రాష్ట్ర స్థాయి పోటీల్లో వరుసగా బంగారు పతకాలు సాధించిన మానస, ఆగ్రాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. తన ప్రతిభతో చెన్నైలో ఉచితంగా విద్యాభ్యాసం చేసే అవకాశాన్ని పొందిన ఆమె, అక్కడ కూడా రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణాన్ని సాధించింది. యోగాలో డిప్లమా పూర్తి చేసి, క్రీడా రంగంలో అనేక పురస్కారాలు అందుకున్న మానస సాధించిన ఈ అంతర్జాతీయ విజయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయసులోనే ఎన్నో విజయాలను తన ఖాతాలో వేసుకుంటూ, తోటి క్రీడాకారులకు ఆమె స్ఫూర్తిగా నిలుస్తోంది

# బయ్యవరం గ్రామం వద్ద లారీ యాక్సిడెంట్లో గాయాలపాలైన విద్యార్థులు



అనకాపల్లి జూన్ 25 (పల్లె వెలుగుదినపత్రిక) అనకాపల్లి జిల్లా, కసింకోట మండలం, బయ్యవరం గ్రామం వద్ద వివేకానంద పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న క్రమంలో అటువైపుగా వెళ్తున్న లారీ ఢీకొట్టడం చేత గాయాలపాలైన విద్యార్థులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి నందు తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీ దాడి రత్నాకర్ గారు పరామర్శించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ గారు మాట్లాడుతూ దురదృష్టవశాత్తు పాఠశాల విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో లారీ వలన ఢీకొనబడి పలువురు విద్యార్థులు గాయాల పాలయ్యారని వీరందరూ ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని అన్నారు. వీరికి పూర్తిగా మెరుగైన వైద్యం అందించడం కొరకు సిటీ స్కాన్ వంటి అధునాతన వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని వీరికి ఎటువంటి ప్రాణాపాయ స్థితి గాని, ఫ్రాక్చర్లు గాని జరగలేదని తల్లిదండ్రులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. వీరిని మరో మూడు గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అనంతరం మీరందరినీ డిశ్చార్జ్ చేయడం జరుగుతుందన్నారు.

# కృష్ణాలయ నిర్మాణానికి రూ. 50 వేల విరాళం ఇచ్చిన పలివెల వీరబాబు



సీతానగరం, జూన్ 25 (పల్లె వెలుగు దినపత్రిక) :- మండలంలోని లంకూరు గ్రామంలో గొల్లల సోలోపు సమీపంలో నిర్మిస్తున్న కృష్ణాలయ ఆలయ నిర్మాణానికి సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు రూ. 50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు విరాళం చెక్కును ఆలయ కమిటీ అధ్యక్షుడు వంటపాటి సూరిబాబుకు ఆయన అందజేశారు. రాబోయే కృష్ణాష్టమి నాటికి ఆలయ ప్రతిష్టా కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండటమే కాకుండా ఆలయ నిర్మాణాలకు తనవంతు సహకారం అందిస్తున్న పలివెల వీరబాబుకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన ప్రజా సేవా దృక్పథం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ పార్టీ మండల అధ్యక్షుడు నందమూరి చిట్టి స్వామి, మండల మహిళా అధ్యక్షురాలు తవిటికి సునీత, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పలివెల జ్యోతి, కొవ్వూరి ఆదిరెడ్డి, గొలుగూరి నవీన్ రెడ్డి, ద్వారంపూడి స్వామి కుమార్ రెడ్డి, కూరాకుల వెంకటమంగ, వంటపాటి విజయ దుర్గ, మాగాపు పావని, గొంగుల లక్ష్మి, చిట్టి మేని రాజు, వంటపాటి గన్నమ్మ తదితరులు పాల్గొన్నారు

## నేరేడుచర్లలో నార్కోటిక్ డాగ్‌తో ముమ్మర తనిఖీలు..!

సూర్యాపేట జిల్లా ప్రతినిధి । 25-06-2026 నేరేడుచర్ల మండల కేంద్రంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలన లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ సహాయంతో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రజా న్యూస్ నెట్‌వర్క్ సమాచారం మేరకు హోటళ్లు, హాస్టళ్లు, పాఠశాలల పరిసరాలు, టీ దుకాణాలు, కిరాణా దుకాణాల్లో ప్రత్యేక సోదాలు చేపట్టారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని ప్రజలను కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# పల్స్ పోలియో అవగాహన సదస్సు ! వైద్యాధికారి డాక్టర్ నళిని పుష్పలత

రావికమతం, జూన్ 25 (పల్లె వెలుగు దినపత్రిక): 





జూన్ 28న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి, పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నళిని పుష్పలత పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సిబ్బంది శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు అంగన్‌వాడీ సిబ్బందికి పల్స్ పోలియో నిర్వహణపై పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా:పిల్లలకు పోలియో చుక్కలు వేసే సరైన పద్ధతులు. బూత్‌ల వద్ద అనుసరించాల్సిన క్రమశిక్షణ మరియు రికార్డుల నిర్వహణ. వ్యాక్సినేషన్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి వివరించారు. రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 0 నుంచి 5 సంవత్సరాల లోపు వయస్సు గల 3,819 మంది పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వైద్యాధికారి వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని నూటికి నూరు శాతం చేరుకోవడానికి మొత్తం 31 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు, ప్రయాణాల్లో ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు అందేలా ఒక ప్రత్యేక ట్రాన్సిట్ మొబైల్ టీమ్ కూడా అందుబాటులో ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సీహెచ్‌వో కె. హేమసుందర్ రావు, హెల్త్ సూపర్వైజర్లు సత్యనారాయణ, ఎం. కనకమహా లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు నాగేశ్వరరావు, వెంకటేశ్వర రావు మరియు పెద్ద సంఖ్యలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్య గమనిక: తల్లిదండ్రులందరూ తమ 5 ఏళ్ల లోపు పిల్లలను దగ్గరలోని పోలియో బూత్‌కు తీసుకెళ్లి, తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, దేశాన్ని పోలియో రహితంగా మార్చడంలో భాగస్వాములు కావాలని ఆరోగ్య శాఖ కోరుతోంది.

## నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమాలు



జగ్గంపేట, జూన్ 25 (పల్లె వెలుగు దినపత్రిక) :- అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ పూర్ణిమ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ - వికసిత్ భారత్ కి పహచాన్ అనే నినాదంతో నిర్వహించిన ఈ సదస్సులో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పూర్ణిమ పిలుపునిచ్చారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు, సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు అమ్మాజీ, సునీత, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## యువనేత కాసాని సతీష్ కుమార్ హఠాన్మరణం

గోపాలపురం, జూన్ 25 (పల్లె వెలుగుదినపత్రిక) :- తూర్పుగోదావరి జిల్లా




గోపాలపురం మండలం దొండపూడి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి మాజీ మండల యువ అధ్యక్షుడు కాసాని సతీష్ కుమార్ (నాని) అకాల మరణం చెందారు. చిన్న వయసులోనే ఆయన హఠాన్మరణం చెందడం పట్ల గ్రామస్తులు, పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మండల యువ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కాలంలో సతీష్ కుమార్ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని, నిస్వార్థమైన సేవలతో అందరి మన్ననలు పొందారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. ఆయన మృదుస్వభావం, మంచితనం అందరినీ ఆకట్టుకునేవని, అటువంటి వ్యక్తిని కోల్పోవడం గ్రామానికి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. కాసాని సతీష్ కుమార్ మరణవార్త తెలుసుకున్న పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు మరియు దొండపూడి గ్రామస్తులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అశ్రునివాళులర్పించారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాల్సిన వయసులో ఆయన మరణించడం దొండపూడి గ్రామంలో విషాద ఛాయలను నింపింది. కాసాని నాని ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ స్థానికులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చేసిన మంచి పనులు గ్రామస్తుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పార్టీ నాయకులు పేర్కొన్నారు

## ఉమర్ అలీషా చేతుల మీదుగా నూతనంగా జహెరా డిజైన్ స్టూడియో ప్రారంభోత్సవం



పిఠాపురం, జూన్ (25 పల్లె వెలుగు దినపత్రిక) పిఠాపురం పట్టణం శ్రీ విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక విద్య పీఠానందు పాత ఆశ్రమం వద్ద సద్గురు డాక్టర్ ఉమర్ అలీషా ఆశీర్వాదంతో మరియు అధ్యక్షతన జోహెర డిజైన్ స్టూడియో నూతనంగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఉమర్ అలీషా మాట్లాడుతూ ఎంతోమంది మహిళలకు ఉపాధిని కల్పిస్తూ కుట్టుమిషన్ ఉచితంగా నేర్పుతూ మరియు దాని ద్వారా జీవన అభివృద్ధి తోర్పడే విధంగా ఒక కుటీర పరిశ్రమను సొంతంగా నడుపుకునే విధంగా వారిని తయారు చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా ఉంటూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన మహిళలకు వాళ్ళ పట్ల ఆత్మాభిమానం మరియు స్వయం శక్తిగా ఎదిగే పట్టుదల ఏర్పడుతుందని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో వివిధ చోట్ల ఎంతోమందికి దీని ద్వారా వృత్తిని కల్పిస్తున్నామని అన్నారు. అనంతరం బాదం లక్ష్మి కుమారి మాట్లాడుతూ సుజనాత్మకత నూతన ఆలోచనలు మరియు డిజైన్ ప్రపంచంలో కొత్త ప్రయాణానికి శ్రీకారం చుడుతున్న ఈ శుభ సందర్భంగా మహిళలకు తమ శక్తిని నిరూపించుకునే అవకాశం వచ్చిందని దానిని సద్వినియోగం చేసుకోవాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్టు ద్వారా ఎంతో మందికి తోర్పటును కల్పించడం జరుగుతుందని దీనిని ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాదం లక్ష్మి కుమారి, బాదం చంద్రకాంత్,మున్నీ, అధిక సంఖ్యలో మహిళలు ఆశ్రమ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి సిద్ధమైన మామిడాడ జ్యోతుల పాపారావు సాగునీటి పథకం

జగ్గంపేట, జూన్ 25 (పల్లె వెలుగు దినపత్రిక) :- జగ్గంపేట మండలం



మామిడాడలో రూ. 3.50 కోట్ల జిల్లా ఖనిజ నిధితో నిర్మించిన జ్యోతుల పాపారావు సాగునీటి పథకం పనులను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలువలు, మోటార్లు, పైపులైన్ పనులన్నీ పూర్తి చేసి ట్రయల్ రన్ కూడా విజయవంతం చేశామని తెలిపారు. ఈ ఖరీఫ్ నుంచే మామిడాడ, ఇర్రిపాక, మర్రిపాక, గొల్లలగుంట, నరేంద్రపట్నం గ్రామాలలోని 2,500 ఎకరాలకు సాగునీరు అందించి బీడు భూములను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో సాగునీటి కష్టాలను తీరుస్తున్నామని జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, క్లస్టర్ ఇంచార్జి బస్వా చినబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోదిరెడ్ల సుబ్బారావు, నీటి సంఘం చైర్మన్ జ్యోతుల ఈశ్వరరావు, జ్యోతుల సత్యమూర్తి, రైతులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. త్వరలోనే ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించి నీటిని విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ సాగునీటి ప్రాజెక్టు ద్వారా ఐదు గ్రామాల్లోని వేలాది రైతు కుటుంబాలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సాగునీటి సదుపాయాలను మెరుగుపరుస్తోందని ఆయన స్పష్టం చేశారు

## రోడ్ల మరమ్మతులకు ఎంపీడీవో రాజేశ్వరరావు చర్యలు



కాట్రేనికోన, జూన్ 25 (పల్లె వెలుగు దినపత్రిక) :- కాట్రేనికోన మండల పరిధిలోని రోడ్లపై గుంతలు లేకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.రాజేశ్వరరావు తెలిపారు. గురువారం నడవపల్లి వెళ్లే మార్గంలో ఉన్న గుంతలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఎంపీడీవో జేసీబీ సహాయంతో గుంతల్లో నిలిచిన నీటిని తొలగించేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం గుంతల్లో నీరు నిలిచి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇది పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్డు కావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే గ్రావెల్ వేయించి మరమ్మతులు పూర్తి చేస్తామని ఎంపీడీవో రాజేశ్వరరావు స్థానికులకు హామీ ఇచ్చారు. మండలంలోని అన్ని రహదారులను పరిశీలించి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## యానాంలో అస్తవ్యస్తంగా చెత్త కుండీల నిర్వహణ

యానాం, జూన్ 25 (పల్లె వెలుగు దినపత్రిక) :- యానాం పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన చెత్త కుండీలు నిర్వహణ లోపంతో



అధ్వానంగా తయారయ్యాయి. ఫలితంగా చెత్త రోడ్లపైనే పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఆహారం కోసం చెత్త కుండీల వద్దకు చేరుతున్న ఆవులు, దూడలు ప్లాస్టిక్ సంచులను, వ్యర్థాలను తింటున్న దృశ్యాలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్లాస్టిక్ మింగడం వల్ల పశువుల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, చెత్త కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి వర్షాకాలంలో మరింత తీవ్రతరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పాడైపోయిన పాత చెత్త కుండీల స్థానంలో మూతలతో కూడిన కొత్త బిన్లను ఏర్పాటు చేయాలని, చెత్తను సకాలంలో తరలించేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పట్టణ పరిశుభ్రతపై మున్సిపాలిటీ అధికారులు తక్షణమే స్పందించి, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం అధికారులు, ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు

## ఏ.ఎం.ఏ.ఎల్ కళాశాల లో డిఫెన్స్ శిక్షణా తరగతులు



అనకాపల్లి, జూన్ 25, (పల్లె వెలుగు దినపత్రిక): స్థానిక ఏ ఎం ఏ ఎల్ కళాశాల లో యాజమాన్యం మాజీ సైనికులు కూంద్రం శివ ఆధ్వర్యంలో డిఫెన్స్ శిక్షణా తరగతులను కళాశాల అధ్యక్ష, కరెస్పాండెంట్ ధరాల కృష్ణ పేర్రాజు, పెంటకోట వెంకట రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు కృష్ణ పేర్రాజు మాట్లాడుతూ కళాశాలలో ఎన్ సి సి ఆర్మీ, నేవీ విభాగాలలో, స్పోర్ట్స్ లలో శిక్షణ పొందుతూ అనేక మంది ప్రతి సంవత్సరం అగ్నివీర్ కు సెలెక్ట్ అవటం జరుగుతుంది. ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు ఇంటర్ మరియు డిగ్రీ లతో పాటు డిఫెన్స్ కోచింగ్ ఇవ్వటం వలన మరింత మంది డిఫెన్స్ రంగాలకు సెలెక్ట్ అవటానికి ఈ కోచింగ్ ఎంతో దోహద పడుతుందని, ఈ సదావకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ సాగర్ మాట్లాడుతూ కళాశాల కు అనేక మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలు నుండి వస్తారు, వారికి చాలా మందికి డిఫెన్స్ రంగాలకు వెళ్లాలని కోరుకుంటారు, మంచి భవిష్యత్తు ఉంటుందనే సదుద్దేశ్యం తో ప్రారంభించిన యాజమాన్యం నకు మీ తరుపున ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

## రైతులు పండ్ల తోటల పెంపకంతో ఆర్థిక అభివృద్ధి ! ఎమ్మెల్యే వేగుళ్ళ...



మండపేట, జూన్ 25,(పల్లె వెలుగు దినపత్రిక)రైతుల ఆదాయాన్ని పెంచడం, భూసారాన్ని కాపాడడం మరియు దీర్ఘకాలికంగా స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలం, జెడ్.మేడపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొబ్బరి మొక్కలు నాటి ఆయన ప్రారంభించారు. అనంతరం 224 కొబ్బరి మొక్కలను రైతులకు పంపిణీచేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మామిడి, జామ, నిమ్మ, ఉసిరి, సీతాఫలం తదితర పండ్ల మొక్కల నాటడం, గుంతల తవ్వకం, నీటి సంరక్షణ పనులు, మొక్కల సంరక్షణ వంటి కార్యకలాపాలకు ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. అర్హులైన చిన్న, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని వినియోగిం చుకొని తమ భూముల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. పండ్ల తోటల ఏర్పాటు వల్ల రైతులకు దీర్ఘకాలిక ఆదాయం లభించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల చంద్రశేఖర్, ఈదిపల్లి మంగరాజు, సంగిశెట్టి అమ్మన్న, అత్తిలి వెంకన్నబాబు, సంగిశెట్టి శేఖర్, కొట్టు జగపతి, వడ్డి వీరాస్వామి, ఎపిడిఒ సత్యనారాయణ, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ తదితరులు పాల్గొన్నారు

## అంగన్ వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ...



మండపేట, జూన్ 25, (పల్లె వెలుగు దినపత్రిక): అంగన్ వాడీ కేంద్రాలలో సురక్షితమైన, వేగవంతమైన, పర్యావరణహిత వంట విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలం, ద్వారపూడి గ్రామపంచాయితీ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ ముఖ్య అతిథిగా పాల్గొని ద్వారపూడి, జెడ్.మేడపాడు, మెర్నిపాడు గ్రామాలకు చెందిన అంగన్ వాడీ సెంటర్లకు ఇండక్షన్ స్టవ్ లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండక్షన్ స్టవ్‌ల ద్వారా వంట వేగంగా పూర్తవుతుందని, దీనివల్ల అంగన్‌వాడీ కార్యకర్తలకు సమయం కలిసివచ్చి, పిల్లల చదువు, ఆటలపై మరింత శ్రద్ధ పెట్టే వీలుంటుందన్నారు. పొగ లేని వంట విధానం వల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు, గర్భిణులకు మరియు కార్యకర్తలకు ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందన్నారు. అంతేకాకుండా గ్యాస్ రీఫిల్లింగ్ ఖర్చులతో పోలిస్తే ఇండక్షన్ స్టవ్‌ల వాడకం ద్వారా ఇంధన ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం కమిటీ డైరెక్టర్ యరగతపు బాబ్జి, సత్తి సత్యనారాయణ, చింతా దొరబాబు, అడబాల బుల్లబ్బు, ఎంపిడిఒ సత్యనారాయణ, సిడిపిఒ పూర్ణిమ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అలుగోజు వారి వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న డాక్టర్ చల్లా.



ఆలమూరు,జూన్ 25(పల్లె వెలుగు దినపత్రిక):మండలం కేంద్రం ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్ లోని ఎస్ జె ఆర్ ఫంక్షన్ హాల్లో గురువారం జరిగిన అలుగోజు శ్రీనివాసరావు, పద్మావతి దంపతుల కనిష్ట కుమారుడు వెంకట నారాయణ- నాగ మహేశ్వరి ల వివాహ రిసెప్షన్ లో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి, దీవించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు. ఈ కార్యక్రమంలో నెక్కంటి బుజ్జి,ఎలుగుబంట్ల సాయిబాబు,ఎలుగుబంట్ల బ్బూరయ్య, ఎరుకొండ గణేష్,లంకే వెంకటరెడ్డి,నార్గని సెంథిల్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## కాసాని సతీష్ మృతికి తానేటి వనిత సంతాపం



దొండపూడి, జూన్ (పల్లె వెలుగుదినపత్రిక): 25: జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మండల యూత్ అధ్యక్షుడు కాసాని సతీష్ (ఎస్ఆర్ నాని) ఆకస్మిక మృతిపట్ల మాజీ హోం మంత్రి తానేటి వనిత తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సతీష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com